Follow: @ANNTELUGU
07-10-2026
ANN తెలుగు
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 256 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ

### స్థానిక సీట్లపై చర్చలు.. ఆరు మేయర్ స్థానాలపై జనసేన గురి

**అమరావతి, మహా :** స్థానిక సంస్థల ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన పవన్‌కు మంత్రి లోకేశ్ స్వాగతం పలికారు. సుమారు రెండు గంటలపాటు ఈ సమావేశం సాగింది. స్థానిక ఎన్నికలపై ప్రధానంగా చర్చ నడిచింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల మధ్య సమన్వయానికి కమిటీ ఏర్పాటు.. మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



### ప్రభుత్వాధినేతగా పాతికేళ్లు

- ప్రధాని మోదీ సరికొత్త చరిత్ర.
- పవన్ చామ్లింగ్, నవీన్ పట్నాయక్, జ్యోతిబసు రికార్డులు అధిగమించిన వైనం.

02



### 100 కోట్ల ప్రయాణాలతో స్త్రీ శక్తి చారిత్రాత్మక ఘనత

- ఏపీ సీఎం చంద్రబాబు హర్షం

02



### భారత మహిళల జట్టు కొత్త కెప్టెన్‌గా స్మృతి మంధాన

- స్మృతికి బాధ్యతలు అప్పగిస్తూ బీసీసీఐ ప్రకటన

02



### 14న దుర్గమ్మ దర్శనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- 16న మూల నక్షత్రం వేళ కుటుంబసమేతంగా పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు.

02



### బీఆర్ఎస్‌కు భారీ షాక్

- పార్టీని వీడిన మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు.
- ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో ఘోర అవమానం జరిగిందంటూ ఆవేదన.
- ఆత్మగౌరవాన్ని చంపుకుని కొనసాగలేనని స్పష్టీకరణ

02

### అమరావతి పనుల్లో వేగం పెంచాలి

- నెలకు రూ.2 వేల కోట్ల పనులు పూర్తి చేయాలి.
- నిర్మాణ సంస్థలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు

02



## రాహుల్ గాంధీ అరెస్ట్

### ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తత



దద్దరిల్లిన ఢిల్లీ వీధులు

బారికేడ్లను తోసుకుని.. త్రివర్ణపతాకం ఎగరేసిన రాహుల్

రాహుల్, ప్రియాంక సహా కాంగ్రెస్ నేతల అరెస్ట్

- రాహుల్ గాంధీ అరెస్టుపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం
- ఎస్ఐఆర్ పై పోరాటం ఆపేది లేదని స్పష్టం
- రాహుల్ అరెస్ట్ ను ఖండించిన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్
- దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల నిరసనలు

**ఢిల్లీ, మహా :**
ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఓట్ల తొలగింపు వ్యవహారంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష కూటమి ఎంపీలు దేశ రాజధానిలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎస్పీ, టీఎంసీ సహా కూటమి పార్టీల కీలక ఎంపీలందరూ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వైపు ర్యాలీగా బయలుదేరారు. అయితే, పార్లమెంట్ స్ట్రీట్ లోని నీతి ఆయోగ్ భవన్ ఆకాశవాణి భవన్ మధ్యలో ఢిల్లీ పోలీసులు పటిష్ట బారికేడ్లతో ఈ ర్యాలీని అడ్డుకున్నారు. ముందుకు వెళ్లేందుకు అనుమతి నిరాకరించడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీలంతా రోడ్డుపైనే బైఠాయించి కేంద్ర ప్రభుత్వం, మిగతా 2వ పేజీలో



## ఎర్రవల్లి భూముల లెక్క తేల్చండి

- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- 45 ఎకరాల అసైన్డ్ భూమి మిస్సింగ్
- ఎక్కడుందో గుర్తించాలన్న ముఖ్యమంత్రి



**హైదరాబాద్, మహా :** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, దాని శివారులోని వెంకటాపురం గ్రామాల పరిధిలో ఉన్న భూముల వ్యవహారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ రెండు గ్రామాల పరిధిలో ఇటీవలే రెవెన్యూ అధికారులు చేపట్టిన భూముల సర్వే వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉండాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో తాము నిర్వహించిన సర్వేలో కేవలం 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించామని అధికారులు సీఎం రేవంత్ రెడ్డికి మిగతా 3వ పేజీలో

## 'క్యూర్' పరిధిలో ప్రకటనలపై కొరడా

- కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- ప్రతి వార్డుకూ ప్రత్యేకంగా అడ్వర్టైజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్ నియామకం
- అమలు బాధ్యతలను కమిషనర్లకు అప్పగిస్తూ పురపాలక శాఖ ఆదేశాలు



**హైదరాబాద్, మహా.** రాష్ట్ర రాజధాని పరిసరాల్లోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న ప్రచార బోర్డులు, ఫ్లెక్సీలకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగర సుందరీకరణను దెబ్బతీయకుండా, వాహనదారులు, పాదచారుల భద్రతకు విఘాతం కలగకుండా తాత్కాలిక, హైపర్ లోకల్ ప్రకటనల నిర్వహణపై సమగ్ర విధివిధానాలతో కూడిన సరికొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. నగర పరిధిలో ప్రకటనల పర్యవేక్షణను మరింత పటిష్టం చేసేందుకు ప్రతి వార్డుకు ప్రత్యేకంగా మిగతా 3వ పేజీలో



### రాజన్న ఆలయాన్ని కృష్ణ శిలలతో నిర్మించాలి

- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్

**వేములవాడ, మహా :** కాంక్రీట్ తో వేములవాడ రాజన్న గుడి కడుతూ భక్తుల విశ్వాసాన్ని దెబ్బ తీస్తున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా వేములవాడ భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఆమె మీడియాతో మాట్లాడారు. రాజన్న ఆలయాన్ని కృష్ణ శిలలతో ఆగమ శాస్త్రం ప్రకారం నిర్మించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి, మహేష్ గౌడ్ హిట్ జోడీ కాదని.. ఇడుపు కాయితం జోడీ అంటూ దుయ్యబట్టారు. నవంబర్ వరకు రైతులకు 24 గంటలు ఉచిత 3వ పేజీలో

### ఎస్ఐఆర్ ను నిరసిస్తూ .. భారీ ధర్నా



- భారీ ఆందోళనలో పాల్గొన్న కాంగ్రెస్, మిత్రపక్షాలు
- దద్దరిల్లిన కలెక్టరేట్
- రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ మిత్రపక్షాల నిరసనలు

07






# అమరావతి పనుల్లో వేగం పెంచాలి..

**అమరావతి, మహా** : ఆంధ్రప్రదేశ్ కీర్తికిరీటంగా నిలవనున్న రాజధాని అమరావతి నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంబంధిత శాఖల అధికారులను, నిర్మాణ సంస్థలను ఆదేశించారు. అమరావతి పనుల పురోగతిపై మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, సీఆర్‌డీఏ అధికారులు, రాజధాని నిర్మాణ పనులు చేపడుతున్న వివిధ కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజధానిలో జరుగుతున్న మౌలిక సదుపాయాల కల్పన, అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి కీలక కట్టడాలతో పాటు హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనుల పురోగతిపై ముఖ్యమంత్రి కూలంకషంగా సమీక్షించారు. గడిచిన నెల రోజుల్లో రాజధాని పరిధిలో దాదాపు రూ.1,345 కోట్ల విలువైన పనులను ఆయా నిర్మాణ సంస్థలు విజయవంతంగా పూర్తి చేశాయని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం.. పనుల వేగాన్ని మరింతగా పెంచాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. ఇకపై ప్రతి నెలా కనీసం రూ.2 వేల కోట్ల మేర పనులు పూర్తయ్యేలా నిర్మాణ సంస్థలు నిర్దిష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆయన స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణాన్ని కేవలం ఒక సాధారణ కాంట్రాక్టు పనిలా కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఒక చారిత్రక ఘట్టంగా భావించి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని చంద్రబాబు నాయుడు నిర్మాణ సంస్థల ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఖర్చును తగ్గించే వినూత్న విధానాలను ప్రభుత్వంతో పంచుకోవాలని, అదే సమయంలో నాణ్యతలో ఏమాత్రం రాజీ పడకుండా అత్యున్నత ప్రమాణాలతో కూడిన అద్భుతమైన నగర నిర్మాణానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాజధాని అమరావతి వ్యాప్తంగా వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 152 ప్రాజెక్టుల పనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పి.నారాయణ ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరించారు. ఈ పనుల్లో ప్రస్తుతం ఏకంగా 41 వేల మంది కార్మికులు రేయింబవళ్లు శ్రమిస్తున్నారని ఆయన వెల్లడించారు. నెలకు రూ.2 వేల కోట్ల పనుల లక్ష్యాన్ని చేరుకునేలా పనుల వేగం పెంచేందుకు మ్యాన్‌పవర్‌ను (మానవ వనరుల సంఖ్యను) మరింతగా పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మరోవైపు రాజధాని కనెక్టివిటీకి అత్యంత కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా పట్టాలెక్కించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంతో, సంబంధిత జాతీయ సంస్థలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ అడ్డంకులను అధిగమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్

( మొదటి పేజీ తరువాయి )



ఎన్నికల సంఘం వైఖరికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. భారీ ఆందోళనతో ఈసీ కార్యాలయాన్ని ముట్టడించిన రాహుల్ గాంధీని తీవ్ర ఉద్రిక్తతల నడుమ మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేయగా, దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. రాహుల్, ప్రియాంక సహా ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులతో రాహుల్, ప్రియాంక వాగ్వాదానికి దిగారు.

**నీ ఆట ముగిసింది బ్రో**

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. "జ్ఞానేశ్, ఆట ముగిసింది బ్రో.. ఇక రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది"అంటూ సీఈసీపై తీవ్రమైన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘం అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలను ఖూనీ చేస్తోందని, పారదర్శకతను తుంగలో తొక్కిన జ్ఞానేశ్ కుమార్ ఆ కుర్చీలో కొనసాగే నైతిక హక్కును కోల్పోయారని మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. సీఈసీ వైదొలిగేంత వరకు దేశవ్యాప్తంగా తమ పోరాటం ఆగదని, అక్టోబర్ 8 వరకు జిల్లా స్థాయిల్లో పాదయాత్రలు, ఆందోళనలు కొనసాగిస్తామని విపక్ష నేతలు స్పష్టం చేశారు. విపక్ష ఎంపీల ధర్నాతో పార్లమెంట్ పరిసరాల్లో భారీగా భద్రతా బలగాలను మోహరించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

**రాహుల్ గాంధీ అరెస్టుపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం**

ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ అరెస్టును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీతో పాటు ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌ను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అహింసాయుతంగా ఉద్యమిస్తున్న నాయకులను బలవంతంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికే విరుద్ధమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అరెస్టులు, జైళ్లు, లాఠీఛార్జీలు గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ నేతలకు కొత్త కాదన్నారు. అరెస్టులు చేసి, జైళ్లలో పెట్టినంత మాత్రాన ఎన్నికల కమిషన్ తప్పులపై కాంగ్రెస్ పోరాటం ఆపదని రేవంత్ స్పష్టం చేశారు. కాగా రాహుల్ గాంధీ అరెస్ట్ ను పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా నిరసించారు. అరెస్ట్‌లతో అక్రమాలను కప్పిపెట్టలేరన్నారు.

# 14న దుర్గమ్మ దర్శనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**విజయవాడ, మహా :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత కనకదుర్గమ్మను ఈ నెల 14వ తేదీ సాయంత్రం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకోనున్నారని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఆమె 14, 15 తేదీల్లో విజయవాడలోనే బస చేస్తారని తెలిపారు. ఇంద్రకీలాద్రిపై వైభవంగా జరగనున్న దసరా శరన్నవరాత్రుల ఏర్పాట్లను మంగళవారం మంత్రుల బృందంతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతిష్ఠాత్మక సరస్ ఉత్సవాల నేపథ్యంలో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా నగరానికి విచ్చేయనున్నారని, వారికి కూడా అమ్మవారి దర్శన ఏర్పాట్లు పకడ్బందీగా కల్పిస్తామని చెప్పారు. దసరా మహోత్సవాల్లో అత్యంత పవిత్రమైన మూల నక్షత్రం రోజైన ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబసమేతంగా విచ్చేసి రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని మంత్రి వివరించారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దసరా నవరాత్రి ఉత్సవాలను మునుపెన్నడూ లేని రీతిలో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఉత్సవాల వేళ ఇంద్రకీలాద్రికి వచ్చే ప్రతి ఒక్క భక్తుడికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనాలను అత్యంత సులభతరం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. ఈ తొమ్మిది రోజుల పాటు దాదాపు 25 లక్షల మంది భక్తులు దుర్గమ్మ దర్శనార్థం తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారని, అందుకు అనుగుణంగా ప్రతిరోజూ సుమారు 2.5 లక్షల మంది భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నామని వెల్లడించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొండచరియలను సురక్షితంగా తొలగించి ఆ ప్రాంతాన్ని తాత్కాలికంగా భక్తుల రాకపోకలకు అందుబాటులోకి తీసుకువచ్చామని, రైల్వే శాఖకు చెందిన స్థలాన్ని ప్రత్యేకంగా హోల్డింగ్ ఏరియాగా వినియోగిస్తున్నామని చెప్పారు. భక్తుల రద్దీ నియంత్రణకు హోల్డింగ్ ఏరియా నుంచి ఆలయం వరకు దాదాపు 2.5 కిలోమీటర్ల మేర బారికేడ్లతో పటిష్టమైన క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. క్యూలైన్లలో వేచి ఉండే వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ఎండ, అలసట బారిన పడకుండా స్వచ్ఛమైన తాగునీరు, పాలు, బిస్కెట్లు నిరంతరం అందజేసేలా స్వచ్ఛంద సంస్థలు, సిబ్బందిని నియమిస్తున్నామని చెప్పారు. హోల్డింగ్ ఏరియాలోనే భక్తులకు నిరంతరాయంగా ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. నగరంలోకి వచ్చే అన్ని ప్రధాన రహదారులను అనుసంధానిస్తూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ నెల 23వ తేదీ తర్వాత రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భవానీ దీక్షాపరులు ఇంద్రకీలాద్రికి తరలివస్తారని, వారి కోసం ప్రత్యేక మార్గాలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూనే ప్రముఖులకు ప్రొటోకాల్ ప్రకారం దర్శనాలు కల్పిస్తామని, రాష్ట్రపతి, ముఖ్యమంత్రులు వచ్చే సమయంలో మాత్రమే భద్రతా కారణాల దృష్ట్యా కొద్దిసేపు సామాన్యుల దర్శనాలను నిలిపివేస్తామని చెప్పారు. అంతరాలయ దర్శనంలో ఎక్కడా తొక్కిసలాట, ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం వేళల్లో 2 గంటల 45 నిమిషాల చొప్పున మాత్రమే వీఐపీ దర్శనాలకు సమయం కేటాయించినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.

# ప్రభుత్వాధినేతగా పాతికేళ్లు

**న్యూఢిల్లీ, మహా.** భారత ప్రధాని నరేంద్ర మోదీ తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో సరికొత్త చరిత్ర లిఖిస్తూ అత్యంత అరుదైన మైలురాయిని చేరుకున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వ అధినేతగా నిరంతరాయంగా 25 సంవత్సరాల (పాతికేళ్లు) సుదీర్ఘ పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. 2001 అక్టోబరు 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి పగ్గాలు చేపట్టిన ఆయన, అప్పటి నుంచి నేటివరకు వరుసగా మూడుసార్లు ముఖ్యమంత్రిగా, అనంతరం వరుసగా మూడు పర్యాయాలు దేశ ప్రధానమంత్రిగా కొనసాగుతూ తిరుగులేని నాయకుడిగా నిలిచారు. పాతికేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం నిరంతరాయంగా అధికార పీఠంపై కొనసాగిన అతికొద్ది మంది ప్రపంచ నాయకుల సరసన ఆయన సగర్వంగా స్థానం సంపాదించుకున్నారు. భారత రాజకీయ చరిత్రలోనే ఎన్నికైన ప్రభుత్వానికి సారథిగా అత్యంత సుదీర్ఘకాలం పనిచేసిన రికార్డును ప్రధాని మోదీ సొంతం చేసుకున్నారు. గతంలో దేశంలో అత్యధిక కాలం సీఎంగా పనిచేసిన రికార్డు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉండేది. సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎస్డీఎఫ్) అధినేత అయిన చామ్లింగ్ 1994 డిసెంబర్ నుంచి 2019 మే వరకు మొత్తం 24 సంవత్సరాల 165 రోజుల పాటు నిరంతరాయంగా సీఎంగా సేవలందించారు. ఆ తర్వాత ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ 2000 మార్చి నుంచి 2024 జూన్ వరకు దాదాపు 24 సంవత్సరాల 99 రోజుల పాటు సీఎంగా అధికారంలో కొనసాగారు. పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ దిగ్గజం జ్యోతిబసు 1977 జూన్ నుంచి 2000 నవంబర్ వరకు 23 సంవత్సరాల 137 రోజుల పాటు ప్రభుత్వాధినేతగా పనిచేశారు. చామ్లింగ్ తన సుదీర్ఘ పాలనలో రాష్ట్రాన్ని సేంద్రియ వ్యవసాయంలో అగ్రగామిగా నిలిపితే, నవీన్ పట్నాయక్ విపత్తు నిర్వహణ, స్వచ్ఛమైన పాలన, మహిళా సాధికారతతో ప్రజల ఆదరణ పొందారు. జ్యోతిబసు హయాంలో భూసంస్కరణలు, గ్రామీణాభివృద్ధి కీలక పాత్ర పోషించాయి. అయితే భారత దేశ చరిత్రలోనే వీరందరి కంటే ఎక్కువ కాలం ప్రజాప్రభుత్వ అధినేతగా కొనసాగిన ఏకైక నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోదీ చరిత్ర పుటలకెక్కారు.

అంతర్జాతీయ యవనికపై పరిశీలిస్తే, ప్రజాస్వామ్య వ్యవస్థల్లో సుదీర్ఘ కాలం పాటు అధికారంలో కొనసాగిన నేతలు చాలా అరుదుగా కనిపిస్తారు. సింగపూర్ జాతిపిత, ఆ దేశ తొలి ప్రధాని లీ క్వాన్ యూ 1959 నుంచి 1990 వరకు ఏకంగా 31 సంవత్సరాల పాటు నిరంతరాయంగా ప్రభుత్వాధినేతగా కొనసాగి ఆధునిక ప్రపంచానికి ఒక ప్రమాణంగా నిలిచారు. సహజ వనరులు లేని సింగపూర్‌ను కడు పేదరికం నుంచి ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశంగా ఆయన తీర్చిదిద్దారు. అలాగే ఆసియాలోనే కంబోడియాలో హున్ సేన్ 1985 నుంచి 2023 వరకు సుమారు 38 ఏళ్ల పాటు ప్రధానిగా విధులు నిర్వర్తించారు. మలేషియాలో మహతీర్ మొహమ్మద్ రెండు వేర్వేరు పర్యాయాల్లో కలిపి 24 ఏళ్లకు పైగా ఆ దేశ ప్రధానిగా పనిచేశారు. వీరి సరసన ఇప్పుడు నరేంద్ర మోదీ నిలవడం విశేషం.

ప్రపంచంలోనే అత్యంత విస్తృతమైన, అత్యంత పోటీతత్వంతో కూడిన భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ వరుసగా ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా ఈ 25 ఏళ్ల రికార్డును నమోదు చేసుకోవడం మోదీ విషయంలో అత్యంత ప్రత్యేకమైన అంశం. ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న అనేక మంది నేతలు నియంతృత్వ లేదా వివాదాస్పద పద్ధతుల ద్వారా పీఠాన్ని కాపాడుకున్నారనే అపవాదు మూటగట్టుకోగా, మోదీ మాత్రం రాజ్యాంగబద్ధమైన ఎన్నికల ప్రక్రియ ద్వారానే ప్రజామోదం పొందుతూ ఈ అరుదైన ఘనత సాధించారు. "వికసిత భారత్" లక్ష్యంతో దేశాన్ని ఆర్థిక, సాంకేతిక రంగాలలో అగ్రరాజ్యాల సరసన నిలిపేందుకు ఆయన ప్రస్థానం విజయవంతంగా కొనసాగుతోంది.



# 'క్యూర్' పరిధిలో ప్రకటనలపై కొరడా

( మొదటి పేజీ తరువాయి )

ఒక 'అడ్వర్టైజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్'ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నూతన నిబంధనల ప్రకారం ప్రచార బోర్డుల ప్రదర్శన కాలపరిమితిపై ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. ప్రత్యేక కార్యక్రమాలు, ప్రచారాల కోసం ఇచ్చే తాత్కాలిక ప్రకటనలకు గరిష్ఠంగా కేవలం 3 రోజుల పాటు మాత్రమే అనుమతిస్తారు. అలాగే స్థానిక స్థాయి ప్రచార అవసరాల కోసం ఏర్పాటు చేసుకునే హైపర్ లోకల్ ప్రకటనలకు గరిష్ఠంగా 7 రోజుల వరకు మాత్రమే అనుమతి మంజూరు చేస్తారు. నిర్దేశిత గడువు ముగిసిన వెంటనే సంబంధిత ప్రచార బోర్డులను నిర్వాహకులే తొలగించాల్సి ఉంటుంది. అధికారిక అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ప్రకటనలు ఏర్పాటు చేస్తే వాటిని అధికారులు తక్షణమే తొలగించడమే కాకుండా, బాధ్యులపై భారీగా జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రజా ఆస్తులు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లపై ఎలాంటి బ్యానర్లు, హోర్డింగులు, పోస్టర్లు ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. రహదారులపై ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయం కలిగించేలా, పాదచారుల నడక మార్గాలను (ఫుట్‌పాత్‌లను) ఆక్రమించేలా ఎక్కడా ప్రకటనలు పెట్టకూడదని ఆదేశించింది. ట్రాఫిక్ సిగ్నల్స్, భద్రతా నిఘా కోసం ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల దృశ్యాలకు అడ్డుతగిలేలా ప్రచార బోర్డులు ఉంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించింది. ఈ సరికొత్త మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసే పూర్తి బాధ్యతలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)తో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలోని కార్పొరేషన్ల కమిషనర్లకు ప్రభుత్వం అప్పగించింది. నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఏమాత్రం ఉపేక్ష లేకుండా కొరడా ఝుళిపించాలని ఆదేశాలు జారీ చేసింది.





# బీఆర్ఎస్‌కు భారీ షాక్

**భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత వరుస వలసలతో సతమతమవుతున్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీలో తనకు కనీస గౌరవం దక్కడం లేదని, సొంత పార్టీ నేతలే తనను తీవ్ర అవమానాలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన.. మంగళవారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీ సన్నద్ధమవుతున్న తరుణంలో, గిరిజన సామాజిక వర్గంలో బలమైన పట్టున్న సీనియర్ నేత పార్టీని వీడటం జిల్లాలో రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.తాటి వెంకటేశ్వర్లు రాజీనామాకు దారితీసిన పరిస్థితులపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవలే పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో తనకు ఘోర అవమానం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమావేశానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలో మాజీ ఎమ్మెల్యేనైన తన పేరును కనీసం ముద్రించకపోవడమే కాకుండా, సమావేశంలో తనను కనీసం వేదిక మీదకు కూడా ఆహ్వానించలేదని ఆయన మండిపడ్డారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్‌రావుల పట్ల తనకు అపారమైన గౌరవం ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో కొందరు స్థానిక నాయకులు ఉద్దేశపూర్వకంగానే కార్యకర్తల ముందే తనను అవమానిస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో తన ఆత్మగౌరవాన్ని చంపుకుని పార్టీలో కొనసాగలేనని ఆయన స్పష్టం చేశారు. తనకు రాజకీయాల్లో 40 ఏళ్లకు పైగా సుదీర్ఘ అనుభవం ఉందని, 1999 నుంచే శాసనసభ్యుడిగా పనిచేశానని గుర్తుచేసిన ఆయన.. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎన్నడూ ఇలాంటి అవమానకర పరిస్థితులు ఎదుర్కోలేదని వాపోయారు. నిజానికి గత శాసనసభ ఎన్నికలకు ముందు కూడా తాటి వెంకటేశ్వర్లు తీవ్ర అసంతృప్తితోనే పార్టీ మారారు. ఆ సమయంలో బీఆర్ఎస్ అధిష్ఠానం తీరుపై కినుక వహించి ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. అయితే, అక్కడ తనకు ఆశించినట్లుగా అసెంబ్లీ టికెట్ దక్కకపోవడంతో తిరిగి పాత గూటికి చేరుకున్నారు. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక పార్టీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గెలుపు కోసం ఆయన క్షేత్రస్థాయిలో తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ తిరిగి పార్టీలో తనకు సముచిత స్థానం దక్కకపోగా, అవమానాలు ఎదురవుతుండటంతోనే తాజాగా ఆయన ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో, రెండ్రోజుల్లో తన అనుచరులు, ద్వితీయ శ్రేణి నాయకులు, శ్రేయోభిలాషులతో విస్తృతంగా సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేస్తానని ఆయన స్పష్టం చేశారు. తదుపరి ఏ పార్టీలో చేరాలనే అంశంపై వారితో చర్చించిన అనంతరం అధికారికంగా పూర్తి స్థాయి ప్రకటన విడుదల చేస్తానని వెంకటేశ్వర్లు వెల్లడించారు.



# భారత మహిళల జట్టు కొత్త కెప్టెన్ గా స్మృతి మంధాన

## స్మృతికి బాధ్యతలు అప్పగిస్తూ బీసీసీఐ ప్రకటన

ఢిల్లీ, మహా : భారత మహిళా క్రికెట్ జట్టు నూతన సారథిగా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన నియమితురాలైంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం ప్రకటించింది. ఇప్పటివరకు కెప్టెన్‌గా ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ అన్ని ఫార్మాట్ల సారథ్య బాధ్యతల నుంచి తప్పుకోవడంతో, ఆమె స్థానంలో వైట్ బాల్ క్రికెట్‌కు పూర్తిస్థాయి కెప్టెన్‌గా మంధాన బాధ్యతలు చేపట్టనుంది. 2013లో అంతర్జాతీయ అరంగేట్రం చేసినప్పటి నుంచి జట్టులో కీలక సభ్యురాలిగా కొనసాగుతున్న స్మృతి మంధానకు సారథ్య బాధ్యతలు కొత్తేమీ కాదు. గతంలో ఆమె 18 టీ20లు, నాలుగు వన్డే మ్యాచ్‌లలో భారత జట్టును ముందుండి నడిపించింది. దేశీయ, ఫ్రాంచైజీ క్రికెట్‌లోనూ ఆమె తన నాయకత్వ పటిమను నిరూపించుకున్నారు. ముఖ్యంగా ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును 2024, 2026 సంవత్సరాల్లో విజేతగా నిలిపి టైటిల్స్ అందించింది. తన నియామకంపై స్మృతి మంధాన స్పందిస్తూ, "భారత జట్టుకు నాయకత్వం వహించే అవకాశం లభించడం ఒక ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నాను. నాపై నమ్మకం ఉంచిన బీసీసీఐ, సెలక్టర్లు, సహచర క్రీడాకారిణులు, నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ అందించిన విశేష సేవలను నేను గౌరవిస్తున్నాను. ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి, భారత క్రికెట్‌ను మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు నా వంతు కృషి చేస్తాను" అని ఒక ప్రకటనలో పేర్కొంది.

# చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ

( మొదటి పేజీ తరువాయి )

బలమున్న చోట మిత్రపక్షాలు పోటీ చేసే అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ప్రధానంగా కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలి?.. మేయర్, మున్సిపల్ ఛైర్మన్, జెడ్పీ ఛైర్మన్ పదవులకు అభ్యర్థుల ఎంపికపై నేతలిద్దరు చర్చించినట్లు తెలుస్తోంది. కూటమిలోని పార్టీల మధ్య సమన్వయం చేసుకుంటూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం స్ట్రైక్ రేట్ సాధించేలా ముందకు సాగాలని నిర్ణయించినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ రాగానే కూటమి పార్టీలు సమన్వయంతో ముందుకెళ్లేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవడంపై చర్చించినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీతో పాటుగా సమన్వయం కోసం రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను నియమించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఒకవేళ పోటీ విషయంలో ఇబ్బందులు ఎదురైతే ఈ కమిటీల ద్వారా పరిష్కరించాలనే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది. బీసీలకు 34శాతం రిజర్వేషన్ల అంశంపై సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పైనా పవన్ చంద్రబాబు చర్చించినట్లు సమాచారం. సుప్రీంకోర్టులో రిజర్వేషన్ల అంశంపై నిర్ణయం రాగానే.. స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశాలపైనా చర్చించినట్లు తెలుస్తోంది. మొత్తం మీద చంద్రబాబు, పవన్ కళ్యాణ్ స్థానిక సంస్థల ఎన్నికల కోసం వ్యూహాలను సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. ఈ సందర్భంగా గెలుపే లక్ష్యంగా మేయర్, ఛైర్మన్ స్థానాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ప్రధానంగా విశాఖ పట్టణం, తిరుపతి, విజయవాడ, ఏలూరు, కాకినాడ లేదా రాజమహేంద్రవరం మేయర్ స్థానాలను జనసేన ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.



# 100 కోట్ల ప్రయాణాలతో 'స్త్రీ శక్తి' చారిత్రాత్మక ఘనత

## ఏపీ సీఎం చంద్రబాబు హర్షం

**అమరావతి, మహా** ఆంధ్రప్రదేశ్‌లో మహిళల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్త్రీశక్తి' పథకం చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 100 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు పూర్తి చేసుకున్నారు. ఈ ఘనత పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆదరణ, మాతృమూర్తుల ఆమోదంతోనే ఈ విజయం సాధ్యమైందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "గత ఏడాది ఆగస్టు 15న ప్రారంభమైన స్త్రీశక్తి పథకం, 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలను పూర్తి చేసుకోవడం ఎంతో గర్వకారణం. రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారంటే ఈ పథకం వారి జీవితాల్లో ఎంతగా భాగమైపోయిందో అర్థమవుతోంది" అని తెలిపారు. చదువుకునే విద్యార్థినులు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు, రోజువారీ ఉపాధి కోసం ప్రయాణించే వారికి ఉచిత బస్సు ప్రయాణం ఎంతో శక్తినిచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గించి, తమ అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించే భరోసాను ఈ పథకం అందిస్తోందన్నారు. ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా మహిళలు రూ.3,550 కోట్ల మేర ఆదా చేసుకున్నారని, ఇలా ఆదా అయిన ప్రతి రూపాయి వారి పిల్లల చదువుకు, కుటుంబ అవసరాలకు ఉపయోగపడాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధ్యం చేసినందుకు రాష్ట్రంలోని మహిళలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా, పథకం విజయవంతం కావడంలో అహర్నిశలు కృషి చేసిన ఆర్టీసీ యాజమాన్యానికి, సిబ్బందికి చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# ఎర్రవల్లి భూముల లెక్క తేల్చండి

( మొదటి పేజీ తరువాయి )



వివరించారు. రికార్డుల్లో ఉన్న మిగతా 45 ఎకరాల భూమి అదృశ్యమైందని, దాని జాడ కనిపించలేదని వారు స్పష్టం చేశారు. అధికారుల నివేదికపై తీవ్రంగా స్పందించిన ముఖ్యమంత్రి.. ఆ 45 ఎకరాల అసైన్డ్ భూమి ఎక్కడుందో తక్షణమే తేల్చాలని ఆదేశించారు. ఆ భూమిని కచ్చితంగా గుర్తించేందుకు ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల్లో అధికారికంగా సర్వే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన స్పష్టం చేశారు. సర్వే నంబర్325 సరిహద్దులోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం (ఫామ్‌హౌస్) ఉన్న నేపథ్యంలో, ఈ భూముల వ్యవహారంపై కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు సైతం నోటీసులు జారీ చేసి, సంబంధిత రెవెన్యూ రికార్డులను సమర్పించాల్సిందిగా కోరాలని అధికారులను ఆదేశించారు.

**స్థానిక రైతులకు భూమి పంపిణీ.. అమరవీరుల కాలనీ నిర్మాణం**

సర్వే నంబర్325లో ఉన్న ఈ భూమిని, స్థానికంగా ఉన్న అర్హులైన పేద రైతులకు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. దీనికి తోడు, ఇదే సర్వే నంబర్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాల కోసం ప్రత్యేకంగా "తెలంగాణ అమరవీరుల కాలనీ "ని నిర్మించాలని ఆయన ఆదేశించారు.

ఈ కాలనీలో అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించడమే కాకుండా, సకల సౌకర్యాలతో ఇళ్లను సైతం నిర్మించి ఇవ్వాలని సూచించారు. ఈ కాలనీ నిర్మాణ బాధ్యతలను తెలంగాణ హౌసింగ్ బోర్డుకు అప్పగించాలని ఆదేశించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి, అంటే వచ్చే ఏడాది జూన్ 2వ తేదీలోగా ఈ అమరవీరుల కాలనీ నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన మేరకు అధికారులు గత కొన్ని రోజులుగా ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లోని అసైన్డ్ భూములపై సర్వే చేపట్టిన సంగతి తెలిసిందే.

# కుత్బుల్లాపూర్‌లో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన

- ఏడాదిలోపే లబ్ధిదారులకు తాళాలు
- నిర్ణీత గడువు కంటే ముందుగా నిర్మిస్తే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు.
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**హైదరాబాద్, మహా:** పేదల సొంతింటి కలను వాస్తవరూపంలోకి తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని అత్యంత వేగంగా చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈరోజు (మంగళవారం) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలో ప్రతిష్ఠాత్మక 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణ పనులకు ఆయన లాంఛనంగా శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇంటి కేటాయింపు పత్రాలను ఆయన స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణాన్ని సరిగ్గా ఏడాదిలోపు పూర్తి చేసి, లబ్ధిదారులకు వారి చేతుల మీదుగానే తాళాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అర్హులైన పేదలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఇళ్లను అందిస్తామని ఉద్ఘాటించారు.ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగాన్ని పెంచేందుకు ప్రభుత్వం వినూత్న అడుగులు వేస్తోందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు కంటే ముందుగా ఇందిరమ్మ టవర్స్ పనులను పూర్తి చేసే కాంట్రాక్టర్లకు ప్రత్యేక నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. కాంట్రాక్టు గడువు కంటే ఒక నెల ముందుగా పనులు పూర్తి చేస్తే రూ.45 లక్షలు, అదే రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే ఏకంగా రూ.90 లక్షల మేర అదనపు ప్రోత్సాహక బహుమతిని అందిస్తామని పేర్కొన్నారు. అయితే పనుల వేగం పేరుతో నాణ్యతలో ఏమాత్రం రాజీ పడే ప్రసక్తే లేదని, ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు లబ్ధిదారులు సైతం ఎప్పటికప్పుడు ఆ పనులను దగ్గరుండి పరిశీలిస్తూ ఉండాలని అధికారులకు, ప్రజలకు ఆయన దిశానిర్దేశం చేశారు. గ్రేటర్ పరిధిలోని మొత్తం 23 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఇళ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ జోక్యానికి, పైరవీలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా ఆన్‌లైన్ విధానాన్ని అవలంబించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని గాజులరామారంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఏకంగా 7 వేల మందికి పైగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, క్షేత్రస్థాయి విచారణ అనంతరం అందులో 5,218 మందిని అర్హులుగా గుర్తించామని తెలిపారు. వీరి నుంచి బహిరంగంగా నిర్వహించిన లక్కీ డ్రా ద్వారా ప్రస్తుతానికి 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం మూడు విడతల్లో అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని, ప్రస్తుతం ఇక్కడ 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని ఆయన పేర్కొన్నారు. నగరంలో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇతర ప్రభుత్వ భూములతో పాటు, హౌసింగ్ బోర్డు పరిధిలోని స్థలాలను గుర్తించి రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఈ ప్రాజెక్టును విస్తరిస్తామని మంత్రి తెలిపారు.

## రాజన్న ఆలయాన్ని కృష్ణ శిలలతో నిర్మించాలి

మొదటి పేజీ తరువాయి

కరెంట్ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. అడుక్కుంటారో, కొనుక్కు వస్తారో కానీ రైతులకు కరెంట్ ఇవ్వకపోతే ఊరుకోమని హెచ్చరించారు. సిరిసిల్ల సెస్ లో జరిగిన రూ. 32 కోట్ల అవినీతిపై విచారణ జరపాలని కవిత డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా అయిన తర్వాత కూడా నీటి పారుదల రంగంలో అన్యాయమే జరుగుతోందని మండిపడ్డారు. అప్పర్ మానేర్ - మిడ్ మానేర్ లింక్ పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరంతో సిరిసిల్ల, వేములవాడ నియోజకర్గాలకు ఒరిగిందేమీ లేదన్నారు. నేరెళ్ల బాధితుల పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి వాళ్లను మళ్లీ మోసం చేశారని విమర్శించారు. వారికి న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని దుయ్యబట్టారు. సిరిసిల్ల జిల్లాగా ఏర్పడిన తర్వాత ఇక్కడ ఏం జరిగిందన్నది ప్రజలందరికీ తెలియాలని కవిత అన్నారు. ముఖ్యంగా వేములవాడ రాజన్న ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని.. చోళుల కన్నా ముందు నుంచే గొప్ప చరిత్ర ఉందని కొనియాడారు. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు తన భార్య జాంబవతికి సంతానం కోసం ఇక్కడ కోడె మొక్కులు చెల్లించారని.. ఆనాటి నుంచే కోడె మొక్కుల సంప్రదాయం ప్రారంభమైందని చెప్పారు. తమ పార్టీకి, తమ పిల్లలకు రాజన్న ఆశీస్సులు ఉండాలని తాము కూడా కోడెలు కట్టేశామని వివరించారు. వేములవాడలో కోడెను కట్టేసే సంప్రదాయాన్ని కొంగు బంగారం అంటారని తెలిపారు. అలాంటి ఈ ఆలయంలో కోడెలు సరైన పశుగ్రాసం లేకుండా చనిపోవటం బాధాకరమని అన్నారు. కోడెలు చనిపోతే శాస్త్రం ప్రకారం అంత్యక్రియలు కూడా చేయటం లేదని అన్నారు. ఇక్కడి ఎంపీ బండి సంజయ్ మాట్లాడితే హిందుత్వం అంటారు కానీ.. వేములవాడలో కోడెలు చనిపోతుంటే పట్టించుకోవటం లేదని దుయ్యబట్టారు. వాటికి మంచి పశుగ్రాసం అందించి మంచిగా చూసుకోవాలని కోరుతున్నానని అన్నారు. వేములవాడ ఆలయానికి రూ. 250 కోట్లు మేము ఇచ్చామంటే మేము అంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ లు విమర్శలు చేసుకుంటున్నాయని దుయ్యబట్టారు. ఆలయానికి నిధులిచ్చిన విషయంలో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. అటు వేములవాడ గుడిని కాంక్రీట్ తో నిర్మిస్తున్నారని.. దీనివల్ల ఆలయం ఎక్కువ కాలం నిలవదని అన్నారు. కృష్ణశిలతో ఆగమ శాస్త్ర ఆచారం ప్రకారం ఈ గుడిని నిర్మించాలని డిమాండ్ చేశారు. కృష్ణశిల ఉందని.. ఆగమ శాస్త్రం తెలిసిన వాళ్లు ఉన్నారని.. అయినప్పటికీ ఎందుకు కాంక్రీట్ తో నిర్మిస్తున్నారో చెప్పాలి? అని డిమాండ్ చేశారు.



# సైబర్ నేరగాళ్ల గుట్టురట్టు.

- దక్షిణాదిలో 100 మందికి పైగా ఏజెంట్ల అరెస్టు.
- మ్యూల్ ఖాతాలు, కేవైసీ పత్రాలు సమకూరుస్తున్న ముఠాలపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఉక్కుపాదం.

**హైదరాబాద్, మహా**: దక్షిణాది రాష్ట్రాల్లో వేళ్లూనుకున్న సైబర్ నేరగాళ్ల నెట్‌వర్క్‌కు సైబర్ సెక్యూరిటీ బ్యూరో భారీ షాక్ ఇచ్చింది. అమాయకుల పేరుతో బ్యాంకు ఖాతాలు తెరిపించి, వాటిని సైబర్ ముఠాలకు అప్పగిస్తున్న అక్రమార్కులపై అధికారులు ఉక్కుపాదం మోపారు. సైబర్ కేటుగాళ్లకు నిధుల మళ్లింపు కోసం 'మ్యూల్ ఖాతాలు' (మధ్యవర్తి ఖాతాలు) సమకూరుస్తూ, నకిలీ కేవైసీ పత్రాలను అందజేస్తున్న దళారులపై ఏకకాలంలో విరుచుకుపడి 100 మందికి పైగా కీలక ఏజెంట్లను అరెస్టు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వెలుగుచూసిన ఎన్నో భారీ ఆర్థిక మోసాలతో ఈ నిందితులకు ప్రత్యక్ష సంబంధాలున్నట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల పరిధిలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేక బృందాలు దాదాపు రెండు వారాల పాటు నిర్విరామంగా ఈ ఉమ్మడి ఆపరేషన్‌ను కొనసాగించాయి. పక్కా సమాచారంతో ఆయా రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించిన అధికారులు, ఈ దందాలో ప్రధాన పాత్ర పోషిస్తున్న వంద మందికి పైగా ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. అమాయక ప్రజలకు డబ్బు ఆశ చూపి వారి గుర్తింపు కార్డులతో బ్యాంకు ఖాతాలు తెరిపించడం, వాటి ద్వారా వచ్చే డెబిట్ కార్డులు, చెక్ బుక్కులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను అంతర్జాతీయ, అంతర్రాష్ట్ర సైబర్ ముఠాలకు విక్రయించడం వీరి ప్రధాన పనిగా తేలింది. నిందితుల స్థావరాల నుంచి వందలాది మ్యూల్ ఖాతాలకు సంబంధించిన డెబిట్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్కులు, చెక్ పుస్తకాలు, పలు మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులను అధికారులు భారీ ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. దక్షిణాదిలోని పలు ప్రాంతాల్లో పట్టుబడిన ఈ నిందితులను సంబంధిత స్థానిక న్యాయస్థానాల నుంచి ట్రాన్సిట్ వారంట్ పొంది మంగళవారం హైదరాబాద్‌కు తరలించారు. వీరందరినీ నగరంలోని సైబర్ క్రైమ్ విభాగంలో ముమ్మరంగా విచారిస్తున్నారు. ఈ ముఠాల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు, వీరు ఇప్పటివరకు ఎన్ని వందల కోట్ల రూపాయల మేర అక్రమ లావాదేవీలకు సహకరించారు, వీటిలో విదేశీ హ్యాకర్ల ప్రమేయం ఎంత ఉందనే కోణాల్లో అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశముందని అధికార వర్గాలు వెల్లడించాయి.

# వాయుసేన నూతన అధిపతిగా ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్

- 29వ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా నియామకం.. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం
- అక్టోబరు 31న బాధ్యతల స్వీకరణ.



**న్యూఢిల్లీ, మహా**: భారత వాయుసేన (ఐఏఎఫ్) నూతన అధిపతిగా ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ప్రస్తుతం వాయుసేన ఉప అధిపతిగా (వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్) సేవలందిస్తున్న ఆయనను భారత 29వ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అక్టోబరు 31, 2026న పదవీ విరమణ చేయనుండటంతో, అదే రోజున ఆశుతోష్ దీక్షిత్ నూతన అధిపతిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. దేశ భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేయడంలో, ఆధునిక సాంకేతికతతో వాయుసేనను సమర్థవంతంగా తీర్చిదిద్దడంలో అపార అనుభవం ఉన్న సీనియర్ సైనిక అధికారికి ఈ అత్యున్నత బాధ్యతలు దక్కాయి.

**నాలుగు దశాబ్దాల అంకితభావం.. సుదీర్ఘ అనుభవం**

ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్ దాదాపు నాలుగు దశాబ్దాలుగా భారత వాయుసేనలో విశిష్ట సేవలందిస్తున్నారు. ఆయన 1986 డిసెంబర్ 6న వాయుసేన ఫైటర్ స్ట్రీమ్‌లో పైలట్‌గా చేరారు. తన సుదీర్ఘ ప్రస్థానంలో వివిధ రకాల యుద్ధ విమానాలలో 3,500 గంటలకు పైగా ప్రయాణించిన అపార అనుభవం ఆయన సొంతం. అత్యాధునిక మిరాజ్2000, వివిధ రకాల మిగ్ వేరియంట్లు, జాగ్వార్, హాక్, ఐఎల్78 విమానాలతో పాటు స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేజస్ యుద్ధ విమానాన్ని కూడా ఆయన నడిపారు. ఆయన కేవలం సాధారణ పైలట్‌గా మాత్రమే కాకుండా, క్లిష్టమైన విమానాలను పరీక్షించే 'ఎక్స్‌పెరిమెంటల్ టెస్ట్ పైలట్'గా, నూతన పైలట్లకు శిక్షణనిచ్చే 'క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్'గా వైమానిక దళానికి అత్యుత్తమ సేవలందించారు.

**కీలక ఆపరేషన్లలో క్రియాశీలక పాత్ర.. ఉన్నత పురస్కారాలు**

దేశ సరిహద్దు రక్షణ, సంక్షోభ సమయాల్లో భారత సైన్యం చేపట్టిన పలు కీలక సైనిక చర్యల్లో ఆయన ముందుండి నడిచారు. కార్గిల్ యుద్ధ సమయంలో చేపట్టిన ప్రతిష్ఠాత్మక 'ఆపరేషన్ సఫేద్ సాగర్'తో పాటు, ఉగ్రవాద వ్యతిరేక చర్యలైన 'ఆపరేషన్ రక్షక్', 'ఆపరేషన్ సిందూర్' వంటి కీలక సైనిక ఆపరేషన్లలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించి తన సైనిక ప్రతిభను చాటారు. తన కెరీర్‌లో అత్యంత కీలకమైన బాధ్యతలను నిర్వర్తించిన ఆయన, గతంలో చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా, సెంట్రల్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ఇన్‌చీఫ్‌గా కూడా విజయవంతంగా పనిచేశారు.

నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీ (డీఎస్ఎస్‌సీ), నేషనల్ డిఫెన్స్ కాలేజీ (ఎన్‌డీసీ) వంటి అత్యున్నత సైనిక విద్యా సంస్థల్లో శిక్షణ పొందిన దీక్షిత్ నాయకత్వ ప్రతిభకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం పరమ విశిష్ట సేవా పతకం (పీవీఎస్ఎం), అతి విశిష్ట సేవా పతకం (ఏవీఎస్ఎం), వాయుసేన పతకం (వీఎం), విశిష్ట సేవా పతకం (వీఎస్ఎం) వంటి ఉన్నత సైనిక పురస్కారాలతో ఆయనను సత్కరించింది. వాయుసేన ఆధునికీకరణ, స్వదేశీ రక్షణ పరికరాల తయారీకి ప్రాధాన్యతనిస్తున్న ప్రస్తుత తరుణంలో ఆయన నేతృత్వం వైమానిక దళానికి సరికొత్త దిశానిర్దేశం చేస్తుందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి.

## ఎల్‌నినో ప్రభావం కరువు పరిస్థితులపై పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేయాలి

- అక్టోబర్ మాసాంతంలోగా నివేదిక రూపొందించాలి
- సీఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, మహా** : ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితులపై పూర్తి స్థాయి నివేదికను వెంటనే సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖపై మంగళవారం సచివాలయంలో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విపత్తుల నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, కార్యదర్శులు దాసరి హరిచందన, గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 320 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కరువు పరిస్థితులపై ప్రణాళిక, రెవెన్యూ, గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణ మంచి నీటి సరఫరా తదితర శాఖల నుంచి సమగ్ర వివరాలను సేకరించి, నిబంధనల ప్రకారం కరువు ప్రభావిత మండలాలను గుర్తించాలని ఆదేశించారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగిన నైరుతి రుతుపవనాల సీజన్‌లో నమోదైన వర్షపాతం సహా 12 ప్రామాణిక అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర కరువు నివేదికను రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశించిన ప్రమాణాలను ప్రామాణికంగా తీసుకుని కరువు ప్రభావిత మండలాలను ప్రకటించే ప్రక్రియను చేపట్టాలని, ఇందుకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను అక్టోబర్ మాసాంతంలోగా సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో, ఆ సమావేశానికి అవసరమైన అన్ని వివరాలతో సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆయన అధికారులను కోరారు.

## సీఎం రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు

- బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ అరెస్ట్
- ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే అరెస్ట్ చేశారని కేటీఆర్ విమర్శ



**హైదరాబాద్, మహా** : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేస్తూ వివాదాస్పద బ్యానర్లు ఏర్పాటు చేసిన కేసులో బీఆర్ఎస్ నేత, ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను గోపాలపురం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రి వద్ద అభ్యంతరకర రీతిలో బ్యానర్లు ప్రదర్శించారన్న అభియోగంపై ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం, మెడికవర్ ఆసుపత్రికి సంబంధించి రూ. 13,200 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఆరోపిస్తూ క్రిశాంక్ తన అనుచరులతో కలిసి ఆసుపత్రి వెలుపల బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఉపయోగిస్తూ, ఆయనకు అభినందనలు తెలుపుతున్నట్లుగా వ్యంగ్యంగా వీటిని రూపొందించారు. దీనిపై కాంగ్రెస్ నాయకుడు మెట్టు సాయి కుమార్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), సైబర్ క్రైమ్ విభాగాలకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అక్టోబర్ 5న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో క్రిశాంక్, 'ఎంఆర్ మీడియా తెలంగాణ" ప్రతినిధులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 353(2), 352 కింద కేసులు నమోదయ్యాయి. అరెస్టుకు ముందు క్రిశాంక్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ, వివాదాస్పద లావాదేవీల ద్వారా నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కుటుంబానికి చెందిన వ్యాపార ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే కేసులో గతంలో బీఆర్ఎస్ నాయకులు సాయికిరణ్, వినీత్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. క్రిశాంక్ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి అవినీతిని ప్రశ్నించినందుకే కక్షపూరితంగా క్రిశాంక్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ఎండగడుతూనే ఉంటామని ఆయన సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలు కొట్టిపారేశారు. ముఖ్యమంత్రి కుటుంబానికి మెడికవర్ ఆసుపత్రితో ఎటువంటి వ్యాపార సంబంధాలు లేవని తెలంగాణ ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. తాజా అరెస్టు పరిణామాలతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు మరింత ముదిరాయి.

## విపక్షాల ఆందోళనకు బీజేడీ మద్దతు

- ఈసీకి వ్యతిరేకంగా ఢిల్లీ మార్చ్‌లో పాల్గొన్న ఎంపీలు.
- కూటమిలో చేరలేదు.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే అన్న సులతా దేవ్ నవీన్ పట్నాయక్‌కు ధన్యవాదాలు తెలిపిన పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ.



**న్యూఢిల్లీ, మహా** : కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ దేశ రాజధాని న్యూఢిల్లీలో విపక్ష 'ఇండియా' కూటమి చేపట్టిన భారీ నిరసన ప్రదర్శనకు బిజూ జనతాదళ్ (బీజేడీ) మద్దతు పలికింది. ఓటర్ల జాబితా సమగ్ర సవరణలో అక్రమాలు జరిగాయంటూ కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం ముట్టడికి ఇండియా కూటమి నేతలు చేపట్టిన మార్చ్‌లో బీజేడీ ఎంపీలు నేరుగా పాల్గొన్నారు. అధికారికంగా 'ఇండియా' కూటమిలో భాగస్వామి కానప్పటికీ, జాతీయ స్థాయిలో విపక్షాలు చేపట్టిన ఈ కీలక ఉద్యమానికి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బీజేడీ మద్దతు ప్రకటించడం దేశ రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రాధాన్యం సంతరించుకుంది.పార్టీ అధినేత, ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశాల మేరకే తాము ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నామని బీజేడీ ఎంపీ మానస్ మంగరాజ్ స్పష్టం చేశారు. ఆయనతో పాటు మరో ఎంపీ సులతా దేవ్ కూడా ఈ ర్యాలీలో పాల్గొని నిరసన తెలిపారు. అయితే, తాము ఈ ఆందోళనలో పాల్గొన్నంత మాత్రాన 'ఇండియా' కూటమిలో చేరినట్లు కాదని ఎంపీ సులతా దేవ్ స్పష్టం చేశారు. అధికార ఎన్డీయే కూటమికి, విపక్ష ఇండియా కూటమికి తమ పార్టీ సమాన దూరం పాటిస్తోందన్న విధానంలో ఎలాంటి మార్పు లేదని ఆమె తేల్చిచెప్పారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణ, ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పారదర్శకతను కాపాడటం కోసమే తాము ఈ నిరసనలో భాగస్వామ్యమయ్యామని ఆమె వెల్లడించారు. మరోవైపు విపక్షాల పోరాటానికి ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ మద్దతు ప్రకటించడంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ స్పందించారు. నవీన్ పట్నాయక్‌కు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ సంస్థలను కాపాడుకోవడానికి విపక్ష పార్టీల మధ్య పరస్పర సమన్వయం అత్యంత ఆవశ్యకమని మమతా బెనర్జీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## బస్సులో పరిచయం.. ప్రేమ పేరుతో మోసం

**తాడేపల్లి, మహా:** బస్సులో పరిచయమైన యువతిని ప్రేమ పేరుతో మోసం చేసి రూ.20 లక్షలు, బంగారం తీసుకున్నాడని ఓ ఆర్టీసీ కండక్టర్‌పై యువతి ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆశ్రయించగా, ఘటనపై సమగ్ర విచారణ జరిపి తప్పు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను మంత్రి ఆదేశించారు. బాధితురాలు ఫోన్‌పే లావాదేవీలు, కాల్స్, మెసేజ్‌లు, బంగారం కొనుగోలు బిల్లులను ఆధారాలుగా సమర్పించినట్లు తెలిపింది. మహిళల పట్ల ఆర్టీసీ సిబ్బంది బాధ్యతాయుతంగా, మర్యాదగా వ్యవహరించాలని మంత్రి సూచించారు.



ANN తెలుగు

మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్

07-10-2026

మహా ప్రత్యేకం

04

# దద్దరిల్లిన ఢిల్లీ

## గరాహుల్ , ప్రియాంకల అరెస్ట్‌తో తీవ్ర ఉద్రిక్తత



(మహా డెస్క్) :

దేశ రాజధాని ఢిల్లీ మంగళవారం విపక్షాల ఆందోళనతో దద్దరిల్లింది. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు, హైడ్రామాకు దారితీసింది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం 'నిర్వాచన్ సదన్' వైపు నిరసన ర్యాలీగా బయలుదేరారు. అయితే, ఆకాశవాణి భవన్ సమీపంలో పోలీసులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ బారికేడ్లు ఎక్కి, చేతిలో జాతీయ జెండాను ప్రదర్శిస్తూ తన నిరసనను తీవ్రతరం చేశారు. అనంతరం ఇతర నేతలతో కలిసి రోడ్డుపైనే బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఢిల్లీ పోలీసులు రంగప్రవేశం చేసి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ, శివసేన (యూబీటీ) సహా పలువురు విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని బస్సుల్లోకి ఎక్కించారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రాహుల్ సహా నేతల అరెస్ట్ తో దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి.






















# బాలసదనం ప్రారంభం

**భువనగిరి అక్టోబర్ 6 మహా న్యూస్ :** భువనగిరి పట్టణంలోని సింగన్నగూడెం వద్ద నూతనంగా నిర్మించిన బాలసదనం భవన ప్రారంభోత్సవంలో స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం బాలికలతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు బాలల సంక్షేమం భద్రత విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది అన్నారు మెరుగైన విద్య వసతి సంరక్షణ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ వెంక రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆవేసి చిస్తీ జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్ డి ఈ శివకుమార్ యేసయ్య మార్కెట్ కమిటీ చైర్పర్సన్ శ్రీ రేఖ బాబురావు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు



# ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ సౌకర్యం.. నూతన విద్యుత్ పోల్స్ ఏర్పాటు

**పాలకుర్తి, అక్టోబర్ 6 మహా** : పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు నూతన విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ చొరవతో, మానాల ప్రసాద్ గారి సహకారంతో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పోల్స్ ఏర్పాటు పనులు చేపట్టారు. కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో పోల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాలకుర్తి సర్పంచ్ పెద్దపల్లి తిరుమల దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తూ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, కరెంట్ ఆఫీసర్ మానాల ప్రసాద్, మాజీ ఎంపీటీసీ దుర్గం కుమార్, లైన్‌మెన్లు మోతిలాల్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# రెడ్‌క్రాస్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

- **చైర్మన్‌గా సంగెం లక్ష్మణరావు.. వైస్ చైర్మన్‌గా రాధాకృష్ణారెడ్డి**
- **మానవతా సేవలను మరింత విస్తృతం చేస్తాం: నూతన కార్యవర్గం**

**కరీంనగర్ మహా** : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా మేనేజింగ్ కమిటీకి నూతన కార్యవర్గం ఎన్నికైంది. డిప్యూటీ కోఆపరేటివ్ ఆఫీసర్ సమక్షంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా/ఎన్నికల ద్వారా ఎంపిక చేశారు.నూతన కార్యవర్గంలో చైర్మన్‌గా సంగెం లక్ష్మణరావు, వైస్ చైర్మన్‌గా రాధాకృష్ణారెడ్డి, చీఫ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా పెండ్యాల కేశవరెడ్డి, స్టేట్ ఈసీ మెంబర్‌గా కుందారపు మహేశ్వర్, కోశాధికారిగా గోనె శ్రీనివాస్ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా రాగి శ్రీనివాస్, హనుమాండ్ల రాజిరెడ్డి, కాన్పర్తి మనోహర్‌రావు, చిదుర సురేష్, కోలా అన్నారెడ్డి, పెద్ది విద్యాసాగర్, సైని నరేందర్, ఎలుగందల మునీందర్, శ్రీహరిరెడ్డి, మొగలోజు రాకేష్ ఎన్నికయ్యారు. కలెక్టర్, సీపీకి మర్యాదపూర్వకంగా భేటీ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులు ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్, టీజీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీచరణ్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఐఏఎస్, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఐపీఎస్లను వారి చాంబర్లలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పూల బొకేలు, స్వీట్లు అందజేసి నూతన కార్యవర్గ సభ్యులను పరిచయం చేశారు. టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా చైర్మన్‌గా ఎన్నికైన విషయాన్ని కలెక్టర్, సీపీకి తెలియజేసి నూతన కార్యవర్గాన్ని పరిచయం చేశారు. అదేవిధంగా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ, డీఆర్వోలను కూడా నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి తమ కార్యవర్గాన్ని పరిచయం చేసుకున్నారు. ఉద్యోగ సంఘాల సహకారం మరువలేనిది నూతనంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ సంగెం లక్ష్మణరావు మాట్లాడుతూ, తమ ఎన్నికలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్ గౌడ్‌తో పాటు ఉద్యోగ జేఏసీ నాయకులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. అన్ని శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్ సంఘాలు, అంగన్వాడీ టీచర్లు, జిల్లా అధికారులు తదితరులను సమన్వయం చేస్తూ ఉద్యోగులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా నాయకులు కృషి చేశారని పేర్కొన్నారు. తమ విజయానికి ఉద్యోగ సంఘాల నాయకులు వెన్నెముకగా నిలిచారని, తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా పనిచేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆశయాలకు అనుగుణంగా సమాజ సేవలో ముందుంటామని చెప్పారు. రక్తదానం, ఆరోగ్య సేవలకు ప్రాధాన్యం కరీంనగర్ జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తృతం చేస్తామని సంగెం లక్ష్మణరావు తెలిపారు. మానవతా సేవలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రక్తదాన కార్యక్రమాలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, ఆరోగ్య సేవలు, యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గానికి రెడ్‌క్రాస్ సేవలు మరింత చేరువయ్యేలా సమన్వయంతో పనిచేస్తామని, సంస్థ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు నూతన కార్యవర్గం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

**అభినందనలు**

నూతన కార్యవర్గ సభ్యులను టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎడ్ల అరవింద్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సర్దార్ హర్మీందర్‌సింగ్, పట్టణ సంఘం అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, వెలిచాల సుమంత్రావు, రాంమోహన్, కొండల్‌రెడ్డి, జలాలుద్దిన్, అక్బర్ తదితరులు అభినందించారు.

# దసరా నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన అమ్మవారి ఆలయం

- **విరాజిల్లుతున్న కరీంనగర్ శ్రీ మహాశక్తి దేవాలయం**
- **ఈనెల 11 నుండి 20 వరకు ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు**
- **10 రోజులు 10 అధ్యాత్మిక అనుభూతులు**
- **భవానీ దీక్షాపరులతో కిటకిటలాడనున్న మహాక్షేత్రం**
- **అమ్మ దర్శనమే కాదు...అన్న ప్రసాదం హైలైట్**
- **భక్తులారా...భారీగా తరలిరావాలంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు**



**కరీంనగర్ మహా:** గుప్పెడు మంది భక్తులతో ప్రారంభమైన కరీంనగర్ శ్రీ మహాశక్తి దేవాలయం నేడు లక్షలాది మంది భక్తుల విశ్వాస క్షేత్రంగా విరాజిల్లుతోంది. 2010 జూన్ 17న శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య స్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠించిన ఈ ఆలయం 16 ఏళ్లుగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తులను ఆకట్టుకుంటోంది. దసరా నవరాత్రి ఉత్సవాలకు ఆలయం ముస్తాబవుతోంది. అక్టోబర్ 11 నుంచి 20 వరకు పది రోజుల పాటు ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. చండీ పారాయణం, లక్ష్మీపూజ, సహస్రనామ పారాయణం, చండీ హోమం, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. నవరాత్రి సందర్భంగా వేలాది మంది భవానీ దీక్షాపరులతో ఆలయం కిటకిటలాడనుంది. గత కొన్నేళ్లుగా దుర్గామాల ధరించే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని నిర్వాహకులు తెలిపారు. 108 రోజుల దీక్ష, మండల దీక్ష, నవరాత్రి దీక్షలతో భక్తులు అమ్మవారి సేవలో పాల్గొననున్నారు.అమ్మవారి దర్శనంతో పాటు అన్నప్రసాదానికి కూడా ఆలయంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. నవరాత్రి ఉత్సవాలన్నిరోజులూ భక్తులకు రుచికరమైన భోజనం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంతమంది భక్తులు వచ్చినా చివరి వరుసలో ఉన్నవారికి సైతం ఆప్యాయంగా అన్నప్రసాదం అందించడం ఆలయ ప్రత్యేకతగా నిలుస్తోంది.ఏడాది పొడవునా ఉగాది, శ్రీరామనవమి, శ్రావణ మాసం, వసంత పంచమి, మహాశివరాత్రి, శాకాంబరి ఉత్సవాలు, గణేశ్ నవరాత్రులు, దీపావళి, కార్తీక మాస వేడుకలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నవరాత్రుల్లో ఆధ్యాత్మిక దాండియా మరో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. కుటుంబ సభ్యులతో కలిసి భక్తులు పాల్గొనేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పర్యవేక్షణలో నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. అక్టోబర్ 11 నుంచి 20 వరకు జరిగే ఉత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

# ఓటు చోరీపై కరీంనగర్‌లో ఇండియా కూటమి గర్జన

- **ఇందిరాచౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ**
- **సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించి అరెస్టు చేయాలి**
- **ఓటు హక్కును కాపాడే వరకు పోరాటం ఆగదు**



**కరీంనగర్, అక్టోబర్ 6:** ఓటు హక్కు పరిరక్షణ కోసం ఇండియా కూటమి ఉద్యమబాట పట్టింది. ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితా సవరణపై తీవ్ర ఆరోపణలు చేస్తూ మంగళవారం కరీంనగర్‌లో భారీ నిరసన చేపట్టింది. ప్రజాస్వామ్య పరిరక్షణ వారంలో భాగంగా ఇందిరాచౌక్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మోదీ, అమిత్‌షా, జ్ఞానేష్‌కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేసి, సీఈసీని తొలగించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

**అంబేద్కర్ ఇచ్చిన ఓటును దొంగిలిస్తున్నారు**

కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల సంఘం పనితీరు ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. సీఈసీ జ్ఞానేష్‌కుమార్ ఇతర ఎన్నికల కమిషనర్ల అభిప్రాయాలను పక్కనపెట్టి నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం గతంలో టీఎన్ శేషన్, జేఎం లింగ్డో వంటి అధికారుల హయాంలో విశ్వసనీయతను చాటుకుందని, ప్రస్తుతం ఆ ప్రతిష్ఠ దెబ్బతింటోందని అన్నారు. జ్ఞానేష్‌కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించి సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

**'ఈసీ బీజేపీ అనుబంధ విభాగంగా మారింది'**

రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం బీజేపీ అనుబంధ విభాగంగా మారిపోయిందని ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, అణగారిన వర్గాల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అన్ని వర్గాలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ.. కోట్లాది ఓట్ల తొలగింపుపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

**'బర్తరఫ్ అయ్యే వరకు పోరాటం'**

సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ..సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సీఈసీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ఓట్ల పరిరక్షణకు గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని విస్తరిస్తామని అన్నారు. ప్రతి ఓటరు తన పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు.సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఈసీని తొలగించాలని కోరుతూ కలెక్టర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఎన్నికల సంఘంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

**రాహుల్ పోరాటానికి సంఘీభావం**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటు హక్కు పరిరక్షణ పోరాటానికి సంఘీభావంగా కరీంనగర్‌లో ఈ నిరసన చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఓటు చోరీ ఆరోపణలపై దేశవ్యాప్తంగా ఉద్యమం ఉధృతమవుతోందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి బూత్‌లో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, అవసరమైతే మరింత ఉధృతం చేస్తామని ఇండియా కూటమి నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో వొడితల ప్రణవ్‌బాబు, ఊట్కూరు నరేందర్‌రెడ్డి, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అంబటి జోజిరెడ్డి, సీపీఐ, సీపీఎం, ఫార్వర్డ్ బ్లాక్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆర్టీసీ వర్క్‌షాప్ యూనియన్ అధ్యక్షుడిగా తాళ్లపల్లి

- **అక్టోబర్ 9న ఆర్టీసీ గుర్తింపు ఎన్నికలు**
- **కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు**
- **కార్మికుల సమస్యలను మంత్రి పొన్నం దృష్టికి తీసుకెళ్తా: తాళ్లపల్లి**

**కరీంనగర్ మహా :** కరీంనగర్ ఆర్టీసీ వర్క్‌షాప్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అనుబంధ INTUC, SWU, TWU, SWF యూనియన్‌ల నాయకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు జక్కుల మల్లేశంగౌడ్ తదితరులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. అక్టోబర్ 9న జరగనున్న ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ యూనియన్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నాయకులతో కలిసి పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో టీఆర్ రెడ్డి రాజు, పొన్నం శ్రీనివాస్‌గౌడ్, సురేష్‌గౌడ్, అంజన్నతో పాటు పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



# టపాసుల దుకాణాలకు గడువు

**కరీంనగర్ మహా:** దీపావళి సందర్భంగా తాత్కాలిక బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలనుకునే వ్యాపారులు ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. 17వ తేదీ సాయంత్రం తర్వాత దరఖాస్తులు స్వీకరించబోమని స్పష్టం చేశారు. నిర్ణీత దరఖాస్తుతో పాటు ఆధార్, పదో తరగతి మార్కుల మెమో, రూ.600 ప్రభుత్వ చలాన్, ఫైర్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల నిరభ్యంతర పత్రాలతో ఐదు సెట్ల ప్రతులను సమర్పించాలన్నారు. అధికారులు అనుమతించిన బహిరంగ ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక క్లస్టర్‌లో గరిష్ఠంగా 50 దుకాణాలకు అనుమతి ఉంటుందని, దుకాణాల మధ్య కనీసం మూడు మీటర్ల దూరం, రక్షిత కట్టడాలకు 50 మీటర్ల దూరం పాటించాలని తెలిపారు. ప్రతి దుకాణం వద్ద అగ్నిమాపక యంత్రాలు, ఇసుక, నీటి బకెట్లు, ప్రథమ చికిత్స సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌లు సులభంగా చేరుకునేలా మార్గాలు ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు.



# ఫొటోగ్రాఫర్ కొంతారి శ్రీనివాస్‌కు రెండు జాతీయ స్థాయి అవార్డులు

- **ది బెస్ట్ ఏఐ ఎడిటర్ అండ్ వెడ్డింగ్ వీడియోగ్రఫీ అవార్డు**

**పెద్దపల్లి మహా :** మంథని: ఫొటోగ్రఫీ రంగంలో తన ప్రతిభతో పాటు ఏఐ ఎడిటర్‌గా సేవలందిస్తున్న పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవిసోమనపల్లి గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ కొంతారి శ్రీనివాస్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. ఆయన రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నారు.హైదరాబాద్ శంషాబాద్‌లోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 2, 3, 4 తేదీల్లో నిర్వహించిన ఫొటో ట్రేడ్ షో సందర్భంగా జాతీయ స్థాయిలో భారత్ కళా పురస్కార్-2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వెడ్డింగ్ ఫొటోగ్రఫీ, ఏఐ ఎడిటర్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన శ్రీనివాస్‌కు ది బెస్ట్ ఏఐ ఎడిటర్ అండ్ వెడ్డింగ్ వీడియోగ్రఫీ అవార్డును నిర్వాహకులు అందజేశారు.భారత్ కళా పురస్కార్-2026తో మరో గౌరవం శ్రీనివాస్ ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు ఆయనను రెండు ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు ఎంపిక చేశారు. ఫొటోగ్రఫీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, సినీ నటులు, కార్యక్రమ నిర్వాహకుల చేతుల మీదుగా ఆయన అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో ఉత్తమ వెడ్డింగ్ వీడియోగ్రఫీ అండ్ ఏఐ ఎడిటర్ అవార్డుతో పాటు భారత్ కళా పురస్కార్-2026 అందుకోవడం తనకు ఎంతో ప్రత్యేకమైన విషయమని అన్నారు. తన ప్రతిభను గుర్తించి పురస్కారాలతో సత్కరించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఫొటోగ్రఫీ ప్రయాణంలో ప్రోత్సాహం, సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిగ్మా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ ఎం.సి. శేఖర్, ట్రేడ్ షో నిర్వాహకులు ఎడిట్ పాయింట్ రమేష్, ఫొటోటెక్ అధినేత అభిమన్యురెడ్డి, తెలంగాణ మాజీ ఫొటోగ్రఫీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సినీ నటులు తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వేలాది మంది ఫొటోగ్రాఫర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.




# పాత కేసులకు ఫుల్‌స్టాప్.. నిందితులకు అరెస్టు

- **రెండేళ్లకు పైగా పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి**
- **60, 90 రోజుల్లో చార్జిషీట్లు దాఖలు చేయాలి**
- **సైబర్ మ్యూల్ ఖాతాలపై కొరడా.. 29 బ్యాంకు శాఖలపై నిఘా**
- **దుర్గామాత ఉత్సవాలకు పటిష్ట భద్రతా చర్యలు: సీపీ గౌష్ ఆలం**

**కరీంనగర్ మహా:** పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అధికారులను ఆదేశించారు. రెండేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని, కేసు స్వభావాన్ని బట్టి 60 లేదా 90 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయం నుంచి ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నేర సమీక్ష చేపట్టారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, కేసుల డిస్పోజల్‌ను సమీక్షించిన సీపీ.. ప్రతి ఎస్‌హెచ్‌ఓ పెండింగ్ కేసుల తగ్గింపునకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. దర్యాప్తులో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తును గవంతం చేయాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులపై ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సైబర్ నేరాలకు వినియోగిస్తున్న మ్యూల్ బ్యాంకు ఖాతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, గుర్తించిన 29 బ్యాంకు శాఖలతో సమన్వయం చేసుకుని బాధ్యులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సీపీ సూచించారు. ఉత్సవ కమిటీలతో సమన్వయం చేసుకుని బందోబస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, మాధవితో పాటు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



# రఘునాథ్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

**బిజెపి నాయకుల హెచ్చరిక**

**మంచిర్యాల, మహా :** బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బిజెపి నాయకులు హెచ్చరించారు. బిజెపిలో ఎలాంటి బాధ్యతలు లేని బొలిశెట్టి తిరుపతి, పార్టీ నుంచి సస్పెండ్ అయిన మడిపల్లి సత్యం నిన్న ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో రఘునాథ్, వెంకటేశ్వర్ గౌడ్‌లపై చేసిన వ్యక్తిగత ఆరోపణలను ఖండిస్తూ సోమవారం మంచిర్యాల జిల్లా బిజెపి కార్యాలయంలో హాజీపూర్ మండల అధ్యక్షులు గడ్డం స్వామి రెడ్డి, మంచిర్యాల కార్పొరేషన్ గర్మిళ్ల జోన్ అధ్యక్షులు అమిరిశెట్టి రాజ్ కుమార్, నస్పూర్ జోన్ అధ్యక్షులు కర్రె చక్రవర్తి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ ఎదుగుదల కోసం నిరంతరం కృషి చేస్తున్న రఘునాథ్ పై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భూ సెటిల్మెంట్ చేసే వారితో జతకట్టి, పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రతి సమస్యపై పోరాటం చేస్తున్న రఘునాథ్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. జాతీయ రహదారి 63 విషయంలో రఘునాథ్ ఎవరికీ నష్టం జరగకుండా లక్సెట్టిపేట పట్టణం నుంచి కాకుండా బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరారే తప్ప, అలైన్మెంట్ మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎక్కడా కోరలేదని స్పష్టం చేశారు. జాతీయ రహదారి విషయంలో రఘునాథ్ వ్యాపారుల నుంచి డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలను నిరూపించాలని, లేని పక్షంలో న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను పాలేరులకు పదవులు ఇస్తున్నారని అవమానించడం బాధాకరమన్నారు. గతంలో తిరుపతిని హాజీపూర్ మండల అధ్యక్షుడిగా, సత్యంను మండల ప్రధాన కార్యదర్శిగా చేసి బాధ్యతలు అప్పగించిన రఘునాథ్ నే పాలేరు అనడం సరికాదని స్పష్టం చేశారు. బొలిశెట్టి తిరుపతి కుమారుడికి గతంలో బిజెపి యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా, ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు ఇప్పించింది రఘునాథ్ దేనని గుర్తు చేశారు.ఇకనైనా అసత్య ఆరోపణలు మాని పార్టీ ఎదుగుదలకు కృషి చేయాలని వారు హితవు పలికారు.

# జీవో 76 దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలి

- పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
- రికార్డుల ఆధారంగా పారదర్శకంగా పరిశీలన చేపట్టాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్
- ఆర్డీవో కార్యాలయం ఆకస్మిక తనిఖీ



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** జీవో 76 దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటుగా పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రికార్డుల ఆధారంగా పారదర్శకంగా పరిశీలన చేపట్టాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంను మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవో నెంబర్ 76 కింద వచ్చిన దరఖాస్తుల పరిశీలన స్క్రూటినీ రికమండేషన్ డిమాండ్ నోటీసుల జారీ చెల్లింపులపై కొత్తగూడెం ఆర్డీవో మధు తహసీల్దార్ పుల్లయ్యతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు చేపట్టిన ప్రక్రియ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జీవో 76 కింద జిల్లాలో మొత్తం 4,031 దరఖాస్తులు ఉండగా 2,267 దరఖాస్తులకు స్క్రూటినీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన దరఖాస్తులపై విచారణ సంబంధిత రెవెన్యూ రికార్డుల పరిశీలన పూర్తి చేసి తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి దరఖాస్తు ఏ దశలో ఉందో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ఇప్పటికే రికమండ్ చేసిన దరఖాస్తులను కూడా సంబంధిత రికార్డుల ఆధారంగా మరోసారి పరిశీలించి అర్హతలను ధ్రువీకరించాలని కలెక్టర్ తెలిపారు. గతంలో చేపట్టిన ఫస్ట్ ఫేజ్ సెకండ్ ఫేజ్ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను పరిశీలించి అధికారులు చేసిన విచారణ సిఫారసులకు సంబంధించిన ఆధారాలను నిర్ధారించాలని ఆదేశించారు. ఇప్పటివరకు సుమారు 276 దరఖాస్తులకు డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వివరించారు. డిమాండ్ నోటీసులు జారీ చేసిన దరఖాస్తులు చెల్లింపులు చేసిన లబ్ధిదారులు సేల్ ఆర్డర్లు పూర్తయినవి పట్టాలు జారీ అయిన కేసులను వేర్వేరుగా గుర్తించి పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగూడెం ఇల్లందు ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తు ఎవరి వద్ద పెండింగ్‌లో ఉంది విచారణ పూర్తయిందా రికమండ్ చేశారా డిమాండ్ నోటీసు జారీ చేశారా చెల్లింపు జరిగిందా అనే వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. పాత కొత్త దరఖాస్తులను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిశీలించాలని ఆదేశించారు. ఇప్పటికే పరిశీలన పూర్తయిన దరఖాస్తులను తదుపరి దశకు పంపడంతో పాటు మిగిలిన దరఖాస్తులపై విచారణను వేగవంతం చేసి పెండెన్సీని తగ్గించాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించిన రికార్డులను క్రమబద్ధీకరించి భవిష్యత్తులో ఎటువంటి సందేహాలకు తావులేకుండా చర్యలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. అర్హులైన దరఖాస్తుదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు



## ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

**బెల్లంపల్లి, మహా:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ గ్రంథాలయ చైర్మన్ మహేందర్ రావు జన్మదిన సందర్భంగా తాండూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ద బోయిన శంకర ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి సల్వాజి మహేందర్ రావు చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పెద్దబోయిన శంకర్, వైస్ ప్రెసిడెంట్ లు శంకర్ గౌడ్,షేక్ మోమిన్ అలీ,ప్రధాన కార్యదర్శి లు నవీన్ పటేల్, కటికల మల్లేష్,కార్యదర్శి లు ప్రభాకర్,జైన సాంబయ్య, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మాస వెంకటస్వామి,కార్యదర్శి దుర్గం మహేందర్,తాండూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండగోర్ల అంజి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కామని శ్రీనివాస్,కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకన్న,కోశాధికారి మద్దికుంట చందు,మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పుట్ట శ్రీను,మాజీ జడ్పీటీసీ బండి పోషం,సీనియర్ నాయకులు వెంకగౌడ్,గోవర్ధన్,షేక్ అహ్మద్,రెహ్మాత్, పెద్ద బోయిన రవి,పెద్ది నగేష్,గుర్రం మహేందర్, సత్యం,ఇందురీ సత్యం,ఉప్పుట్ల పోషం,మైనార్టీ నాయకులు మోసిన్ భాయ్,ఎం డి గౌస్,జావిద్ హుస్సేన్,ముజైద్,హథర్ పాల్గొన్నారు.




# తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న బాలిక అంజలికి ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ చేయూత

- 15 వేల రూపాల ఆర్థిక సాయం అందజేత

**మందమర్రి, మహా :** తండ్రిని కోల్పోయిన పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబానికి కూతురు తీవ్ర అనారోగ్యం పాలవడం తీరని శోకాన్ని మిగిల్చింది. మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామానికి చెందిన బండారి అంజలి తీవ్ర అనారోగ్యానికి గురైంది. శరీరంలో ప్లేట్‌లెట్లు పడిపోవడంతో గత రెండు రోజులుగా మంచిర్యాలలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అంజలి తండ్రి బండారి రవి గత నెల సెప్టెంబర్ 10న గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించారు. తండ్రి చనిపోయి నెల తిరగకముందే కుమార్తెకు తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. వైద్య ఖర్చులు భరించలేని నిస్సహాయ స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ ను ఆశ్రయించింది. బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తక్షణమే స్పందించారు. ఆసుపత్రికి వెళ్లి బాలికను పరామర్శించి, చికిత్స నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు సుంకరి మల్లేష్, గౌరవ అధ్యక్షులు సంపత్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. తమ కష్టకాలంలో ఆదుకున్న ట్రస్ట్ సభ్యులకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలియజేశారు.

# దసరా నాటికి రెండు పడకల ఇండ్ల అప్పగింత

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య



**మందమర్రి, మహా :** జిల్లాలో రెండు పడకల ఇండ్ల సముదాయాలను ఈ దసరా నాటికి లబ్ధిదారులకు అప్పగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య ఆదేశించారు. మంగళవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, క్యాతన్‌పల్లి, మందమర్రి మున్సిపాలిటీల పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల గృహ సముదాయాలను ఆయన గృహ నిర్మాణ శాఖ పీడీ, డీఈ, ఏఈలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గృహ సముదాయాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దసరా నాటికి రెండు పడక గదుల ఇండ్లను లబ్ధిదారులకు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి గృహాల అప్పగింతకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి గృహ సముదాయాలను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, తహసీల్దార్, క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్, మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగ పిండి రాజలింగు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# చినుకు పడితే చిత్తడే..చిత్తడి.

**గ్రామసభల్లో ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు.**



**దమ్మపేట ,మహా :** మండల పరిదిలోని మందలపల్లి పంచాయతీ ప్రకాష్ నగర్ కాలనీలో చినుకు పడితే చిత్తడి చిత్తడిగా రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వెనుక బాగంలో ఉన్న కోనేరు ,చిన్న చెరువు ను కొందరు ఆక్రమణదారులు ఆక్రమించడంతో వరదనీరు రోడ్లపైకి వస్తూ ,ఇండ్లను ముంచెత్తుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ కార్యాలయాలలో నిర్వహిస్తున్న గ్రామ సభలలో 10వ వార్డు సబ్యులు నసీమా పలుమార్లు మండల స్థాయి అధికారులకు సమస్యలపై ఫిర్యాదులు చేసినాగాని పట్టించుకోకుండా ,నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహించారు. ఇటీవల పంచాయతీ పాలకులు సైడ్ డ్రైనేజీలు పూడికలు తీశామంటూ ఆర్భాటంగా పనులు చేపట్టిన నాలుగు రోజులు గడవకముందే ,మళ్ళీ డ్రైనేజీలు పూడిపోయి మళ్ళీ రోడ్లపైకి వరదనీరు చేరుతుందంటే పాలకులు ఏమాత్రం చిత్తశుద్ధితో పనులు చేశారోనంటూ స్థానిక ప్రజలు నొసలు చిట్లిస్తున్నారు. ప్రజల సంక్షేమం ,అభివృద్ధి పై పంచాయతీ పాలకులు శ్రద్ధ వహించి , డ్రైనేజీ పూడిక సమస్యలను పరిష్కరించాలని ,వరదనీరు ఇండ్లపైకి రాకుండా చెరువుల భూములను పునరుద్ధరణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



# పల్లెపల్లెకు ఆర్టీసీ ప్రయాణ సేవలను విస్తరిస్తాం

- మారుమూల గ్రామాల రోడ్ల సమస్యను పరిష్కరించాం
- ప్రజారవాణా ఆర్టీసీని ప్రజలు ఆదరించాలి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- పాల్వంచ-దంతలబోర ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**భద్రాద్రి కొత్తగూడెం/పాల్వంచ, మహా:** ప్రతి పల్లెకు ప్రజారవాణా ఆర్టీసీ ప్రయాణ సేవలను అందుబాటులోకి తీసుకువస్తాం అని కొత్తగూడెం శాసనసభసభ్యులు కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. మంగళవారం మండల పరిధిలోని నారాయణరావుపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాల్వంచదంతలబోర ఆర్టీసీ బస్ సర్వీసులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రధాన రోడ్ల సమస్యను పరిష్కరించామని అతి త్వరలో అంతర్గత రోడ్లు పనులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజా రవాణా ఆర్టీసీని ప్రజలు ఆదరించాలని ఆర్టీసీ బస్సులలో సురక్షితంగా ప్రయాణించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగసీతారాములు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, సంఘము సర్పంచ్, బానోతు రవి, నారాయణరావుపేట సర్పంచ్ బండి సరస్వతి, దంతలబోర్ సర్పంచ్, నాయకులు బానోతు రంజిత్, ప్రేమచంద్, ప్రశాంత్, సాయిలి శ్రీను, శ్రీను, సాయిలి ఎంకన్న, వెల్లంకి శివరావు, సత్యనారాయణ రాజు, మేక రాంబాబు, గ్రామ పెద్దలు, ఆర్టీసీ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భర్త అనారోగ్యంతో మనస్తాపం.. మహిళ మృతి

- కుటుంబ ఆర్థిక పరిస్థితులపై ఆందోళనతో విషాద నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం
- కిష్టారం అంబేద్కర్‌నగర్ బీసీ కాలనీలో ఘటన.. కేసు నమోదు

**సత్తుపల్లి, అక్టోబరు 6: మహా :** భర్త అనారోగ్యం.. కుటుంబ ఆర్థిక ఇబ్బందులు.. పిల్లల చదువులు, వైద్య ఖర్చుల భారం.. వెరసి ఓ మహిళ తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందిన ఘటన సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామం అంబేద్కర్‌నగర్ బీసీ కాలనీలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ పరిస్థితులపై ఆందోళనతోనే ఆమె ఈ నిర్ణయానికి పాల్పడి ఉండవచ్చని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. కాలనీకి చెందిన ఇమ్మడిబోయిన వెంకటనారాయణ (43) కిష్టారం సింగరేణి కార్యాలయంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఆయన భార్య విష్ణుప్రియ (35) సత్తుపల్లిలోని కేబుల్ టీవీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా వెంకటనారాయణ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల ఆయనను విష్ణుప్రియ సత్తుపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల్లో గుండె, కాలేయ సంబంధిత సమస్యలు తీవ్రంగా ఉన్నట్లు గుర్తించిన వైద్యులు మెరుగైన వైద్యానికి ఖమ్మం తరలించాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటికే ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు ఉండటంతోపాటు ఇద్దరు ఆడపిల్లల చదువులు, భర్త వైద్యానికి అయ్యే ఖర్చులపై విష్ణుప్రియ ఆందోళన చెందుతున్నట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు పేర్కొన్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో భార్యా భర్త ఆర్థిక పరిస్థితులపై చర్చించిన అనంతరం ఇంట్లోకి వెళ్లిన ఆమె కొద్దిసేపటి తర్వాత అపస్మారక స్థితిలో కనిపించారు. గమనించిన భర్త వెంకటనారాయణ స్థానికుల సహాయంతో ఆమెను హుటాహుటిన సత్తుపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

**కుటుంబానికి మట్టా దయానంద్ పరామర్శ**

విష్ణుప్రియ మృతదేహాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయకుమార్ పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆమె మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**ఘటనపై కేసు నమోదు**

ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి దారితీసిన పరిస్థితులపై కుటుంబ సభ్యులు, స్థానికులను విచారించి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.



# అభివృద్ధి, పారిశుధ్య పనులను వేగవంతం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**మంచిర్యాల, మహా :** జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలను వేగంగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, హౌసింగ్ కార్పొరేషన్ పీడీ బన్సీలాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి రవీందర్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ తిరుపతి, ఏపీడీ మోహన్‌లతో కలిసి వీబీ జీ రామ్ జీ, ఇందిరమ్మ ఇళ్లు, ఇంకుడు గుంతలు, పారిశుధ్యం, బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్లు, ఇంటి పన్నుల వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వీబీ జీ రామ్ జీ పథకం కింద జిల్లాలో అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ, వీవో, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కొత్తగా నిర్మాణం పూర్తైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఐహెచ్‌హెచ్‌ఎల్ చెల్లింపులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాకు మంజూరైన 5.50 కోట్ల రూపాయల నిధులను మెటీరియల్ కాంపోనెంట్ కింద వినియోగించి, సంబంధిత భవనాల నిర్మాణ వ్యయాన్ని నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 2 బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జిల్లాలో ఇప్పటికే మంజూరైన 3,150 ఇంకుడు గుంతలకు మార్కింగ్ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని, మిగిలిన వాటికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, పండుగ నిర్వహించే ప్రాంతాల్లో ముళ్ల పొదలు, చెట్లు వంటి అవరోధాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఏపీవోలు, హౌసింగ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కు ఘన స్వాగతం

**జూలూరుపాడు, మహా:** తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ , గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య ఐఏఎస్ కి మండల పరిధి వినోబానగర్ గ్రామ సర్పంచ్ నవీన్, అధికారులతో కలసి ఘన స్వాగతం పలికారు. భద్రాద్రి జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా ముఖద్వారా గ్రామమైన వినోభానగర్‌లో పీఆర్ కమిషనర్ కి సర్పంచ్, జిల్లా, మండల అధికారులు పుష్పగుచ్ఛాలతో సాదర ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి, పారిశుధ్యం, ఉపాధి హామీ పనుల నిర్వాహణ తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ముఖద్వారంగా ఉన్న గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆదర్శవంతంగా కనిపించాలని సూచించారు.





# ఎమ్మెల్యే అరాచకాలకు అడ్డు కట్ట వేద్దాం

- పాయల్ శంకర్ భూ కబ్జాలకు చరమగీతం పాడుదాం
- భారీ చేరికల కార్యక్రమంలో కంది శ్రీనివాస రెడ్డి వెల్లడి
- ఆదిలాబాద్ సర్వతోముఖాభివృద్దే తన ధ్యేమని స్పష్టం
- అందరికి అండగా ఉంటానని హామీ
- కాంగ్రెస్ గెలుపుకోసం పని చేయాలని పిలుపు
- పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ లో చేరిన చాందా, సయిద్ పూర్ వాసులు



**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ లో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూకబ్జాల కు అంతం కావాలంటే రానున్న శాసనసభ ఎన్నికలలో ఆయనను చిత్తుచిత్తుగా ఓడించాలని కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పార్టీ శ్రేణులతో పాటు నియోజక వర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణం లోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన భారీ చేరికల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆదిలాబాద్ రూరల్ మండలం చాందా గ్రామ కాంగ్రెస్ నాయకులు లంక సుదర్శన్ బొజ్జ అడెల్లు ,సాత్నాల మండల నాయకులు బోనగిరి సంటెన్న, సురేష్ ఆధ్వర్యంలో సయిద్ పూర్ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో బీజేపీ బీఆర్ఎస్ లకు చెందిన నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఇంత పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ లోకి చేరికలు జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. నమ్ముకుని వచ్చిన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. తాను పేదల మనిషినని ఎవరికి ఏ అవసరం వచ్చినా అందరికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు.రోజుకు రోజుకు ఎమ్మెల్యే భూదాహానికి అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్నారు. కోట్ల విలువ చేసే ప్రభుత్వ అసైన్డ్ భూములను కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. బట్టి సావర్గం లోని అసైండ్ భూమిలో కోట్ల విలువ చేసే ప్లాట్లను తన భార్య పేరుపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని అన్నారు. ఆయన అక్రమాలకు త్వరలో చరమగీతం పలుకుదామన్నారు.ఆదిలాబాద్ నియోజక వర్గ ప్రజలు తలచుకుంటే అది ఎంతో దూరంతో లేదన్నారు. రానున్న ఎన్నికలలో ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు.తన చిరకాల ధ్యేయం ఆదిలాబాద్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందడమే అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలతో దూసుకు పోతుందన్నారు.ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు , నాణ్యమైన సన్నబియ్యం , మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ,ఉచిత విద్యుత్తు , ఆరోగ్య శ్రీ పెంపు, రైతుభరోసా , చేయూత ఫించన్లు, రుణమాఫీ లాంటి ఎన్నో మంచి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల నాటికి పార్టీ మరింత బలోపేతం కావాలంటే ఇలాంటి చేరికలు ఎందో దోహదపడతాయన్నారు. నియోజక వర్గంలో ఇప్పటికే రెండు విడతల్లో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని మరిన్ని ఇందరమ్మ ఇండ్లు వచ్చేలా కృషి చేస్తానన్నారు.పార్టీ శ్రేణులందరు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు,డీసీసీబీ మాజీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి,రాందాస్ నాక్లే, కోలా నర్సింలు, షాహిద్ అలీ , సుధాకర్ గౌడ్, దేవిదాస్ చారి, పరమేశ్వర్, ఆదిలాబాద్ రూరల్ , సాత్నాల మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.









# ఎస్ఐఆర్ ను నిరసిస్తూ .. భారీ ధర్నా

- భారీ ఆందోళనలో పాల్గొన్న కాంగ్రెస్, మిత్రపక్షాలు
- దద్దరిల్లిన కలెక్టరేట్
- రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ మిత్రపక్షాల నిరసనలు



**ఆదిలాబాద్ మహా :** నేరపూరితమైన వ్యూహంతో దేశంలో 13కోట్లు పైగా ఓట్లు తొలగించే ఉద్దేశంతో చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ కుట్ర పూరింతంగా తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆయనను వెంటనే బాధ్యతలనుండి తొలగించాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి , డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేసారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలపై మంగళవారం భారీ సంఖ్యలో హాజరైన ఇండియా కూటమి నాయకులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. డీసీసీ కార్యాలయం నుండి కేంద్రానికి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకొని స్థానిక డీసీసీ కార్యాలయం నుండి భారీ ర్యాలీగా తరలివచ్చారు.కలెక్టర్ కార్యాలయ గేట్ ఎదురుగా బైఠాయించి మోదీ , సీఈసీ జ్ఞానేష్ కుమార్ , కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు.జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ,ఓట్ చోర్ గద్దీ ఛోడ్ మోదీ డౌన్ డౌన్ అంటూ అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా చేపట్టిన ధర్నాలో కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కేంద్రం అండతో సీఈసీ ఒక నియంతలా వ్యవహరిస్తున్నారని మోదీకి తొత్తుగా మారారని ఆరోపించారు.ఎస్ఐఆర్ ను రద్దు చేయాలని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు. క్రిమినల్ వ్యూహంతో ఆలోచనలు చేసే ఆయనను అరెస్ట్ చేసి జైలుకు పంపాలన్నారు. మన ఓట్లను కాపాడుకోవడం కోసం మనమంతా పోరాడాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ మాట్లాడుతూ..రాజ్యాంగ బద్ధ సంస్థల స్వతంత్రతను దెబ్బతీసే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, వచ్చే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేసే కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్నికల సంఘంపై ప్రజల్లో విశ్వాసం నిలవాలంటే ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలని అన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించకూడదని ఆయన అన్నారు. అనంతరం ఆర్డీఓ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం లో బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్ , ఆదిలాబాద్ బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్లు బోరంచు శ్రీకాంత్ రెడ్డి ,మల్లెపూల సత్యనారాయణ,ఆదిలాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, నాయకులు సాజిద్ ఖాన్,సుజాత, సంజీవరెడ్డి ,ఖిజర్ పాషా, సిపిఐ నాయకులు ముడుపు ప్రభాకర్ రెడ్డి ,కుంటాల రాములు, సిపిఎం నాయకులు దర్శనాల మల్లేష్ బండి దత్తాత్రి, సిపిఐ ఎంఎల్ నాయకులు జగన్ సింగ్ , ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు రాథోడ్ సుభాష్ , కాంగ్రెస్ నాయకులు పరమేశ్వర్, సేద్మకి ఆనంద్ రావు, అన్నపూర్ణ , షాహిద్, నాహిద్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, టౌన్ కాంగ్రెస్ నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు








# ప్రసూతి ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- వైద్య సేవలు, వసతులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

హనుమకొండ, మహా ; ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ లోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్ )లోని వివిధ విభాగాల్లో విస్తృత తనిఖీలు చేసి గర్భిణీలు, బాలింతలు, మహిళలకు అందిస్తున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని వసతులను కలెక్టర్ పరిశీలించారు. వైద్య సేవల నిమిత్తం అక్కడికి వచ్చిన గర్భిణీ, బాలింతలతో కలెక్టర్ మాట్లాడి అందుతున్న వైద్య సేవలపైన అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఓపీ సేవలు, ఆరోగ్య మహిళా క్లినిక్, ఫెర్టిలిటీ క్లినిక్, ల్యాబొరేటరీ, గైనకాలజీ ఓపీ, స్కానింగ్ గది, స్టోర్ రూమ్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఓపీ రిజిస్టర్లు, ల్యాబ్ రికార్డులను తనిఖీ చేశారు. ఓపీ వివరాలను ఆన్ లైన్ చేస్తున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ లో నిర్వహిస్తున్న పరీక్షలు, గర్భిణులకు సంబంధించిన వివిధ పరీక్షల వివరాలు, నమూనాల సేకరణ విధానం, టెస్ట్ రిపోర్ట్ అందించే సమయం గురించి వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గైనకాలజీ ఓపీకి వచ్చే రోగుల సంఖ్య, ఎంతమంది వైద్యుల అందుబాటులో ఉంటున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ రూమ్ లో పరికరాల పనితీరు, టెస్ట్ రిపోర్ట్స్ ఇచ్చే విధానాన్ని పరిశీలించారు. లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్లలో ఉన్న ఏర్పాట్లు, శుభ్రత, పరికరాల నిర్వహణపై ఆరా తీశారు. స్టోర్ రూమ్ లో మందుల నిల్వలు, వైద్య పరికరాలు, శస్త్రచికిత్స సామగ్రి, వినియోగ వస్తువుల నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య, విధుల కేటాయింపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వైద్య సేవల నిమిత్తం వచ్చే గర్భిణులు, బాలింతలు ఎక్కువసేపు వేచి ఉండకుండా ఆరోగ్య పరీక్షల రిపోర్ట్ లను వీలైనంత త్వరగా అందించాలని సూచించారు. ల్యాబ్ లో నిర్వహిస్తున్న అన్ని పరీక్షల రిపోర్టులను జాప్యం లేకుండా ఇవ్వాలన్నారు. ప్రసూతి, వైద్య సేవల్లో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. అవసరమైన మందులు, సామగ్రి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఆసుపత్రిలోని వార్డులు, ఓపీ ప్రాంగణం, ల్యాబ్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ఆసుపత్రి ఆవరణ నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డ్యూటీ డాక్టర్ లు ఉన్నారు.

# బతుకమ్మ, విజయదశమి వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

**వరంగల్, కరీమాబాద్ మహా;** బతుకమ్మ నవరాత్రులు, విజయదశమి ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా, వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉత్సవాల ఏర్పాట్ల పై ఉర్సు రంగలీల మైదానంలో పోలీస్ కమిషనర్ శ్వేత, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ టి.వెంకన్న, ఉత్సవ కమిటీ సభ్యులు సంజయ్ తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే కొండా సురేఖ మాట్లాడుతూబతుకమ్మ నవరాత్రుల సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు సూచించారు. తొమ్మిది రోజుల పాటు మొబైల్ టాయిలెట్లు అందుబాటులో ఉంచాలని, ప్రతిరోజూ కార్యక్రమాలు ముగిసిన వెంటనే వ్యర్థాలను తొలగించి ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రధాన రహదారులను ముందుగానే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్బీ అధికారులకు సూచించారు. విజయదశమి సందర్భంగా రంగలీల మైదానంలో నిర్వహించే రావణ వధ కార్యక్రమానికి సుమారు లక్ష మంది హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. గత రెండేళ్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్యం, అగ్నిమాపక ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శ్వేతా మాట్లాడుతూ గతం లో నిర్వహించిన బతుకమ్మ ,దసరా ఉత్సవాల ఏర్పాట్లలో ట్రాఫిక్ డైవర్షన్ , ట్రాఫిక్ జామ్ నియాత్రణ ఏర్పాట్లలో




పోలీసు యంత్రాంగం ఉత్సవ కమిటీ సహకరిస్తుందని అన్నారు.

**అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి**

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ట్రాఫిక్, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సౌండ్ నియంత్రణ నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. దసరా రోజున ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడంతో పాటు టూరిజం, డీఆర్డీవో ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాట్లు చేయాలని ఈ వేడుకల పై నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

**చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు**

ఉత్సవాలకు వచ్చే చిన్నారులు తప్పిపోకుండా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పిల్లల చేతికి తల్లిదండ్రుల మొబైల్ నంబర్ తో కూడిన ట్యాగ్ ను ఫ్రెండ్షిప్ బ్యాండ్ తరహాలో ఏర్పాటు చేస్తే, తప్పిపోయిన సందర్భంలో వారిని తల్లిదండ్రులకు సులభంగా అప్పగించేందుకు వీలుంటుందని తెలిపారు.ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సంజయ్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని బతుకమ్మ, దసరా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సహకరించాలని కోరారు. ఈ కార్యమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాశ్, డియార్వో విజయలక్ష్మి, ఆర్డీవో సుమ సంబంధిత శాఖఅదికారులు,ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు గోపాల్ నవీన్ రాజుకమిటీ అధ్యక్షుడు నాగపూరిసంజయ్ బాబు, జనరల్ సెక్రెటరీ మెడిది మధుసూదన్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్న గౌడ్, సంయుక్త కోశాధికారి వెలిది శివమూర్తి, ఉత్సవ కన్వీనర్ వొడ్నాల నరేందర్, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# దేవీ శరన్నవరాత్రులకు బల్దియా కమిషనర్‌కు ఆహ్వానం

**వరంగల్, కార్పొరేషన్ మహా;** శ్రీ భద్రకాళి దేవాలయంలో ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆలయ కార్యనిర్వహణ అధికారి సునీత, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు మంగళవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ. వెంకన్నను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, కల్యాణోత్సవం, ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ను ఉత్సవాలకు హాజరు కావాలని వారు ఆహ్వానించారు.

# పోలీస్ క్రీడల్లో కరీంనగర్ సత్తా

కరీంనగర్ మహా: 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ -2026లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ సత్తా చాటింది. టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో అధికారులు, సిబ్బంది అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం 16 పతకాలు సాధించారు. వీటిలో 9 బంగారు, 4 వెండి, 3 కాంస్య పతకాలు ఉన్నాయి. ఏసీపీ మాధవి, డబ్ల్యూపీసీ స్వప్న, ఏఎస్ఐ పి.ఉమారాణి, హెచ్‌సీ సంజయ్, ఏఎస్ఐ సత్తయ్య పలు విభాగాల్లో పతకాలు సాధించారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి కమిషనరేట్‌కు గుర్తింపు తీసుకొచ్చిన సిబ్బందిని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అభినందించారు.



# పామాయిల్ గెలల చోరీ

- ముగ్గురుని అధుపులోకి తీసుకున్న పోలీసులు.

**దమ్మపేట ,మహా** : మండలంలో రోజు రోజుకి పెరుగుతున్న పామాయిల్ గెలల దొంగతనాలపై స్థానిక యసై. బి. రాజేష్ కుమార్ నిఘా పెంచారు. మంగళవారం ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని కేసునమోదు చేసినట్లు ప్రకటించారు. పోలీసులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే మండల పరిధిలోని పామాయిల్ తోటలను రాత్రి వేళల్లో లక్ష్యంగా చేసుకుని పామాయిల్ గెలలను అక్రమంగా నరికి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను దమ్మపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ట్రాలీ ఆటో, మూడు సెల్‌ఫోన్లు, రూ.20,000వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. దమ్మపేటకు చెందిన పిల్లి వెంకటేశ్వరరావు (45) రాత్రి సమయాల్లో తన AP 20 TA 9724 నంబర్ గల అప్పి ట్రాలీ ఆటోలో పామాయిల్ తోటల్లోకి ప్రవేశించి గెలలను నరికి తరలించేవాడు. అనంతరం దొంగిలించిన గెలలను అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో విక్రయించేందుకు పెరుమాళ్ల కుమార్ బాబు (27) సహకరించేవాడు. అదేవిధంగా చిట్లూరి పుల్లారావు (41) తన పేరుతో ఉన్న FCOD/FL0156 ఖాతా/కోడ్ ద్వారా దొంగిలించిన పామాయిల్ గెలలను ఫ్యాక్టరీలో విక్రయించేందుకు సహకరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. గెలల విక్రయం ద్వారా వచ్చిన నగదును ముగ్గురూ పరస్పరం పంచుకునేవారని పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా గతనెల 6న, 8, 10, తేదీల్లో పార్కలగండి గ్రామ శివారు, మొద్దులగూడెం గ్రామ శివారు తదితర ప్రాంతాల్లోని పామాయిల్ తోటల్లో దొంగతనాలకు పాల్పడినట్లు నిందితులు వెల్లడించారు. దొంగిలించిన పామాయిల్ గెలల విక్రయం ద్వారా సుమారు రూ.20,000 వచ్చినట్లు విచారణలో తేలింది. కాగా నిందితుల నుండి అప్పి ట్రాలీ ఆటో , రెడ్ మీ సెల్ ఫోన్లు 3, నగదు 20 వేలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నగదు లావాదేవీలతో పాటు ఫోన్ పే ద్వారా కూడా డబ్బు బదిలీలు నిర్వహించినట్లు దర్యాప్తులో గుర్తించారు. స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లలోని డిజిటల్ లావాదేవీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసుకు సంబంధించి మరిన్ని వివరాలపై దర్యాప్తు కొనసాగుతోంది. అశ్వారావుపేట సీఐ పి. నాగరాజు రెడ్డి, దమ్మపేట ఎస్ఐలు బి. రాజేష్‌కుమార్, డి. బాలస్వామి నాధం , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన పోలీస్ సిబ్బంది లక్ష్మణ్, రామకృష్ణ రెడ్డిలను సీఐ పి. నాగరాజు రెడ్డి అభినందించారు.

# ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మల్‌రెడ్డి రంగారెడ్డి

- ఉచిత బస్సు ప్రయాణం తీరును పరిశీలించిన ఎమ్మెల్యే
- బొంగ్లూర్ ఓఆర్ఆర్ నుంచి ఇంజాపూర్ దాకా ప్రయాణం



**ఆదిభట్ల అక్టోబర్ 6 మహా**: ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. మహిళా ప్రయాణికులతో మాట్లాడి... ఉచిత బస్సు ప్రయాణం అమలుతీరును తెలుసుకున్నారు. రంగారెడ్డి కలెక్టరేట్‌కు ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన... తిరిగి వెళ్లే క్రమంలో బొంగ్లూర్ ఓఆర్ఆర్ వద్ద కాసేపు ఆగారు. ఇదేసమయంలో ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆపిన ఆయన.... బస్కెక్కి కండక్టర్ వద్ద టికెట్ తీసుకున్నారు. సీట్లో కూర్చొని ప్రయాణించిన ఎమ్మెల్యే... బస్సులో వెళ్తున్న విద్యార్థినులు, మహిళలతో మాట్లాడారు. ఉచిత టికెట్ ప్రయాణం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.

**మహాలక్ష్మితో 45 వేల వరకు ఆదా; విద్యార్థినులు..**

కళాశాల నుంచి తిరిగి వెళ్తున్న పలువురు విద్యార్థినులు ఎమ్మెల్యేకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా చేకూరుతున్న ప్రయోజనాలను వివరించారు. గతంలో కళాశాల బస్సులో వెళితే తమకు యాభై వేల దాకా చెల్లించేవారమని.... ఉచిత బస్సు పథకంతో ఆర్టీసీలోనే ప్రయాణం చేస్తున్నట్లు చెప్పారు. పుట్టింటి నుంచి వస్తున్న ఓ మహిళ.... రూపాయి చెల్లించకుండా తన అమ్మానాన్నల వద్దకు వెళ్లి వస్తున్నట్లు వివరించారు. ఇలా... మరికొందరు ప్రయాణికులు సైతం ఉచిత ప్రయాణంతో కలుగుతున్న ప్రయోజనాలను ఎమ్మెల్యేతో పంచుకుని... ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. డ్రైవర్, కండక్టర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే.... పరిస్థితిని ఆరా తీశారు. సిబ్బంది తన దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను పరిశీలిస్తామని చెప్పారు.

**ప్రజా ప్రభుత్వంలో మహాలక్ష్మి పథకం....**

రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం తెచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలో రోజూ దాదాపు నలభై లక్షల మంది ఉచిత ప్రయాణం చేస్తుంటే.... ఇబ్రహీంపట్నం డిపో పరిధిలోనే లక్ష మందికి పైగా ఉచితంగా ప్రయాణం చేస్తున్నట్లు మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. కాలం చెల్లిన బస్సుల స్థానంలో ఈవీలు తీసుకువస్తున్నట్లు చెప్పారు. అలాగే, కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీని నాశనం చేస్తే... యూనియన్ల పునరుద్ధరణ, గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంగారెడ్డి తో పాటు నాయకులు ఈసి శేఖర్ మామ, ముత్యాల రాజశేఖర్ రావు, రాచర్ల వెంకటేశ్వర్లు, కాకుమాను సునీల్, ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ తదితరులు బస్సులో ప్రయాణించారు.

# లైంగిక వేధింపుల కేసులో ట్రైనీ ఐపీఎస్‌కు ఊరట.

**ఉదయ్ కృష్ణారెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు.**

**హైదరాబాద్, మహా :** సహచర మహిళా అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి న్యాయస్థానంలో ఊరట లభించింది. ఆయనకు ఉప్పరపల్లి కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ఈ కేసులో అరెస్టయి గత 67 రోజులుగా చర్లపల్లి కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన.. కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు. జాతీయ స్థాయి పోలీసు శిక్షణా సంస్థలో చోటుచేసుకున్న ఈ వ్యవహారంలో సుదీర్ఘకాలం జైలు జీవితం గడిపిన తర్వాత ఎట్టకేలకు ఆయనకు బెయిల్ లభించింది. ఉప్పరపల్లి న్యాయస్థానం పలు కఠిన షరతుల మధ్య ఉదయ్ కృష్ణారెడ్డికి ఈ బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల చొప్పున ఇద్దరి పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అలాగే, తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ప్రతి ఆదివారం విధిగా అత్తాపూర్ పోలీసుల ఎదుట హాజరుకావాలని, దర్యాప్తునకు ఎల్లవేళలా పూర్తిగా సహకరించాలని న్యాయమూర్తి తన ఆదేశాల్లో స్పష్టం చేశారు. సాక్ష్యాధారాలను తారుమారు చేసే ప్రయత్నం గానీ, బాధితురాలిని బెదిరించే యత్నాలు గానీ చేయకూడదని సూచించారు.హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో (ఎస్‌వీపీ ఎన్‌పీఏ) శిక్షణ పొందుతున్న సమయంలో ఉదయ్ కృష్ణారెడ్డి తనను తీవ్రస్థాయిలో వేధింపులకు గురిచేశారని, అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ ఓ మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. బాధితురాలి ఫిర్యాదులోని అంశాల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న అత్తాపూర్ పోలీసులు జులై 18వ తేదీన ఉదయ్ కృష్ణారెడ్డి పై పలు సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు.

# అభివృద్ధికి ఆమడదూరంలో శివనగర్ ప్రాంతం

- కచ్చా రోడ్డు పై అలుకు నీళ్లు జల్లి బిజెపి నిరసన
- స్థానిక ఎమ్మెల్యేకు మంత్రులకు ప్రజల గోడు పట్టదా!
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్, శివనగర్ మహా** : వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అసలు ప్రజా ప్రభుత్వ పాలన ఉందా లేదా అంటూ బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శివనగర్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనుల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల జాప్యానికి నిరసనగా మంగళవారం శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో శివనగర్‌లో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. డ్రైనేజ్ గుంతలతో అధ్వాన్నంగా మారిన కచ్చా రోడ్డు పై అలుకు నీళ్లు జల్లుతూ, ప్రజా ప్రభుత్వం, అధికారుల మొద్దు నిద్రను నిరసిస్తూ బిజెపి శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఆందోళనలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కొండా సురేఖ.. మంత్రులకు మా గోడు పట్టదా.. శివనగర్ అంటే ఎందుకు ఇంత వివక్ష.. మీకు ఓట్లు.. మాకు పాట్లా.. వానోస్తే మేము ముంపు లోనే చస్తూ బ్రతుకుతూ మా జీవితాలను గడపాల అంటూ మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ఎమ్మెల్యే.. ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇద్దరూ .. ఇద్దరే అంటూ ధ్వజమెత్తారు. వారికి ఓట్లు తప్ప మన గోస పట్టదని మన సమస్యల పై మనమే యుద్ధం చేయాలని.. ప్రజల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం ముమ్మరం చేస్తుందని... గంట రవికుమార్ స్పష్టం చేశారు. శివనగర్ డ్రైనేజ్ పనుల ఆలస్యం స్థానిక ప్రజలకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. దాదాపు రూ.75 కోట్ల రూపాయల భారీ నిధులు వెచ్చించినప్పటికీ, పనులు నాలుగేళ్లుగా నత్తనడకన సాగడం వెనుక పాలకులు, అధికారుల చేతకానితనమే కారణమని ధ్వజమెత్తారు. నాలుగు నెలల క్రిందట మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ అధికారులతో కలిసి ఇదే రోడ్డు పై స్వయంగా సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారని, పది రోజుల్లోనే పనులన్నీ పూర్తి చేసి, ఈ రోడ్డు ను ప్రజల వాడకానికి ప్రారంభిస్తామని చెప్పి ఏళ్ళు గడుస్తున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. అయినా వారి పార్టీలో.. వారి పదవులకే దిక్కు లేదని.. ఇక మన సమస్యలను ఎక్కడ పట్టించు కుంటారని ఎద్దేవా చేశారు. మాట తప్పడం కొండా దంపతులకు తెలియదని గొప్పలు చెప్పుకునే వారు.. శివనగర్ డ్రెయినేజీ పనుల జాప్యం అలాగే తూర్పు నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీల పై ఇంకెప్పుడు స్పందిస్తారని మండిపడ్డారు. పనుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత వైఖరితో శివనగర్ ప్రజలకు శాపంగా మారిందని గంట ఆరోపించారు. కంపు అనుభవించాల్సి వస్తోందని, నిత్యం డ్రైనేజ్ గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యేకు పట్టడం లేదని విమర్శించారు.

**పదవులు మీవి.. కష్టాలు మావా?**

శివనగర్ డ్రైనేజ్ పనుల పై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని గంట రవి కుమార్ డిమాండ్ చేశారు. నమ్మి ఓట్లు వేసినా ప్రజలను వంచన చేసి పదవులు అనుభవించేది మీరు కష్టాలు అనుభవించేది మేమా, గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం హామీలకే పరిమిత మయ్యాయని, క్షేత్రస్థాయిలో అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు.

ఈ నిరసన శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ, గుంతల రోడ్ల కారణంగా ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని వారి ప్రాణాలకు విలువే లేకుండా పోయిందని, ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని లేని పక్షంలో ఈ నిర్లక్ష్యం పై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శిలు వైట్ల గణేష్, సూర శ్రీనివాస్, బిజెపి జిల్లా నాయకులు ఆడెపు వెంకటేష్, బైరి శ్యాంసుందర్, డివిజన్ కన్వీనర్లు , బిజెపి జిల్లా పదాధికారులు, వివిధ జిల్లా మోర్చా అధ్యక్షులు మాదాసు రాజు, కూచన క్రాంతి కుమార్, సతీష్‌కట్టర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు




# సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

**భువనగిరి మహా**: కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిలిపివేసి ఓటు హక్కును పరిరక్షించే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో బండ్రు శోభారాణి, మున్సిపల్, మార్కెట్, పీఏసీఎస్ చైర్మన్లు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అఖిలపక్షాల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రామన్నపేట సీఐని కలిసిన వంగాల అవినాష్

**భువనగిరి అక్టోబర్ 6 మహా న్యూస్** : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామపంచాయతీ 10వ వార్డు రంగమ్మగూడెం కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబర్ వంగాల అవినాష్ సోమవారం రామన్నపేట పోలీస్ స్టేషన్ లో సీఐ మలుగూరి రవి ని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ రవికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వంగాల అవినాష్ మాట్లాడుతూ, రామన్నపేట మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని, పోలీస్ స్టేషన్ కు న్యాయం కోసం వచ్చే ప్రతి బాధితుడికి, ముఖ్యంగా పేద ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.



# ఎంజీఎం ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- ఆసుపత్రి పరిపాలనా వ్యవస్థ పై పర్యవేక్షణ ఉండాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- అనుమతి లేకుండా గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసులు

**వరంగల్,ఎంజీఎం మహా** : వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అడ్మినిస్ట్రేషన్ విభాగాలతో పాటు రికార్డు రూమ్, ల్యాబ్, వివిధ విభాగాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లోని అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంజీఎం అడ్మినిస్ట్రేషన్ అధికారిని స్పష్టంగా ఆదేశించారు. అధికారులు, సిబ్బంది విధులకు క్రమం తప్పకుండా హాజరై తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రికార్డు రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, రికార్డులను క్రమబద్ధంగా భద్రపరచడంతో పాటు రికార్డు రూమ్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**ల్యాబ్ లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి**

ల్యాబ్‌ను తనిఖీ చేసిన ఆమె, అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఐడి కార్డులు, మాస్కులు, చేతి గ్లౌజులు ధరించి జాగ్రత్తగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.ల్యాబ్ మ్యానువల్ స్లిప్స్ కాకుండా ఆన్లైన్ లో ప్రోగ్రామ్ రూపొందించి టెక్నాలజీ ఉపయోగించి పీ షెట్స్ కి త్వరితగతిన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఎంజీఎం ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి పరిపాలనా వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. ఎంజీఎం కి కుక్కలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.. సెక్యూరిటీ గార్డ్స్ జాగ్రత్తగా నిబద్ధతతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీలో ఎంజీఎం సూపరింటెండెంట్ హరిచంద్ర రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజారెడ్డి, డీబీసీడీవో పుష్పలత తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



# శ్రీ భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలకు భద్రతా ఏర్పాట్లు

స్వయంగా పర్యవేక్షించిన వరంగల్ సీపి

వరంగల్, రంగంపేట మహా ; వరంగల్ నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భద్రకాళి దేవస్థానంలో ఈ నెల 11వ తేదీ నుండి ప్రారంభం కానున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముందస్తు భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ తరపున చేపడుతున్న చర్యలను సిపి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలు, భద్రతా విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్ రావు, హన్మకొండ ఏసీపీ నర్సింహారావు, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ,ఇన్స్పెక్టర్లు ఎన్ కరుణాకర్ రావు, ఎంఏ సుకూర్, కర్నె స్వామి, ఆలయ పాలక మండలి సభ్యులు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్పోర్ట్స్ మీట్ లో పతకాలు సాధించిన వరంగల్ పోలీస్

- క్రీడాకారులను అభినందించిన వరంగల్ సీపీ ఎన్ శ్వేత, ఐపీఎస్



**హనుమకొండ, మహా** : హైదరాబాద్ లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్ లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో విధులు నిర్వహిస్తున్న 12 మంది పోలీసు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బ్యాడ్మింటన్ ఆటలో ఒక బంగారు పతకం, మూడు బ్రాంజ్ మెడల్స్, టేబుల్ టెన్నిస్ ఆటోలో ఐదు బ్రాంజ్ మెడల్స్, లాండ్ టెన్నిస్ ఆటలో ఒక బ్రాంజ్, ఒక సిల్వర్ తో పాటు రెండు బ్రాండ్ మొత్తము 12 పథకాలు సాధించారు. పతకాలు సాధించిన ఎ ఆర్ అడిషనల్ డిసిపి వి. శ్రీనివాస్, టాస్క్ ఫోర్స్ ఏసిపి మధుసూదన్, ఎఆర్ఎసిపిలు పి.అనంతయ్య, కె. నాగయ్య, ఎసిపి.పి.నర్సయ్య, ఎస్సై ఎ.సురేష్, మహిళా ఎఎస్సై ఇ.జమునారాణి, మహిళా హెడ్ కానిస్టేబుల్ యన్.స్వర్ణలత, హెడ్ కానిస్టేబుల్ లు యస్.ఓదెలు, శ్రీరాములు, కానిస్టేబుల్ లు కె.వేణుచారి, పి.తులసీదాస్ లు మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారు సాధించిన పతకాలను పరిశీలంచిన కమిషనర్ క్రీడాకారులను అభినందించి వారి ప్రతిభను ప్రశంసించారు. పోలీసు విధులను సమర్థవంతంగా నిర్వహంచడంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణతో పాటు శారీరక దారుఢ్యం, క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సిబ్బందికి సూచించారు. భవిష్యతుత్‌లో మరిన్ని క్రీడా పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని క్రీడాకారులను ప్రోత్సహంచారు.

# వాడివేడిగా సాగిన మున్సిపల్ అత్యవసర సమావేశం

**నిధులు ఎక్కడ అని కౌన్సిలర్ల ప్రశ్నల వర్షం**

**స్టేషన్ ఘన్‌పూర్, మహా ;** జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అత్యవసర సమావేశం కొద్దిసేపు వాడీవేడిగా సాగింది. పలు అంశాల పై కౌన్సిలర్లు కమిషనర్, అధికారులను ప్రశ్నించడంతో సభలో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. అనంతరం మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్ జోక్యం చేసుకోవడంతో సమావేశం సాధారణ స్థితికి వచ్చింది. వినాయక చవితి, బతుకమ్మ, దసరా పండుగల ఏర్పాట్లు, పారిశుద్ధ్యం, డ్రైనేజీలు, జేసీబీ వినియోగం, సిబ్బంది కొరత, అభివృద్ధి పనులు, నిధుల వినియోగం తదితర అంశాలపై కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు.

# కేయూ కేహబ్ అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**హనుమకొండ, మహా ;** కాకతీయ విశ్వవిద్యాలయంలోని కేహబ్‌లో టీజీ ఈడబ్ల్యూ ఐ డి సి ఆధ్వర్యంలో, రూస 2.0 నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పనుల పురోగతిని సమీక్షించి, వాటిని వేగవంతంగా పూర్తి చేసేందుకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం కు పలు సూచనలు చేసారు. కేయూ కేహబ్ ద్వారా ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రిజిస్ట్రార్ తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయం కేహబ్ తో పాటు టీ హబ్, హైదరాబాద్ మధ్య కుదిరిన అవగాహనా ఒప్పందంలో భాగంగా విద్యార్థులు, యువ ఔత్సాహికులకు మెంటరింగ్ అందిస్తున్నామని పేర్కొన్నారు. అంకుర సంస్థల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తూ ఉత్తర తెలంగాణలో ఒక ప్రముఖ ఇన్నోవేషన్, స్టార్టప్ కేంద్రంగా కేహబ్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఆయన తెలిపారు. త్వరలో దేశంలోనే అతి పెద్ద హ్యాకథాన్ కు కాకతీయ యూనివర్సిటీ వేదికగా నిలవనుందని రిజిస్ట్రార్ వెల్లడించారు.




# ఈవేస్ట్‌ను బాధ్యతగా నిర్వహించాలి...

- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి..
- మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్

**మణుగూరు, మహా** : ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నిర్దేశిత పద్ధతిలో సేకరించి, శాస్త్రీయ విధానంలో రీసైక్లింగ్ చేయడం ద్వారా పర్యావరణానికి కలిగే నష్టాన్ని తగ్గించవచ్చని సింగరేణి మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అన్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో అక్టోబరు 2 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ 6.0లో భాగంగా మణుగూరు ఏరియా ఆసుపత్రి, జీఎం కార్యాలయ ప్రాంగణాల్లో చేపట్టిన ఈవేస్ట్ కలెక్షన్ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పెరుగుతోందని, వాటి నుంచి వెలువడే ఈవేస్ట్‌ను బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపయోగంలో లేని కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర విద్యుత్ వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో రీసైక్లింగ్‌కు పంపాలని సూచించారు. ఈవేస్ట్‌ను సక్రమంగా నిర్వహించడం వల్ల కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు విలువైన సహజ వనరులను పరిరక్షించవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, వ్యర్థాల సమర్థ నిర్వహణకు సింగరేణి సంస్థ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. స్పెషల్ క్యాంపెయిన్ 6.0లో చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని కోరారు. సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ ఎన్. సురేష్ మాట్లాడుతూ ఈవేస్ట్ వల్ల కలిగే దుష్ప్రభావాలు, సరైన నిర్వహణ విధానాలపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగించేందుకు పనికిరాని స్థితికి చేరుకున్నప్పుడు వాటిని సాధారణ వ్యర్థాలతో కలిపి పారవేయకుండా ప్రత్యేకంగా సేకరించాలని సూచించారు. మణుగూరు ఏరియాలో పరిశుభ్రమైన, పర్యావరణహితమైన కార్యాలయ వాతావరణాన్ని కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈ టు జీఎం డి వెంకట రామారావు, ఏజీఎం (సివిల్) సిహెచ్ రాంబాబు, ఏజీఎం (పర్సనల్) ఎన్ రమేష్, డీజీఎం (సివిల్) జి శివప్రసాద్, డివైసీఎంఓ డాక్టర్ ఎం జ్యోతిర్మయి, డా. సురేష్, డాక్టర్ రమణయ్య, డాక్టర్ ఇన్నయ్య, పర్యావరణ అధికారి జె శ్రీనివాసరావు, ఫైనాన్స్ మేనేజర్ పి రమేష్, ఏరియా సెక్యూరిటీ అధికారి కె శ్రీనివాస్, ఎన్. సురేష్, బి శ్యామ్ ప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారులు కె శ్రీనివాస్, వి రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల హక్కులకై ఐక్య కూటమిని గెలిపించాలి

- ప్రభుత్వంలో విలీనం, ఉద్యోగ భద్రతే లక్ష్యం
- ఇయు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ బాబు
- మణుగూరు డిపో ఎదుట జేఏసీ గేట్ మీటింగ్..




**మణుగూరు, మహా :** టీజీ ఆర్టీసీ కార్మికుల ప్రభుత్వంలో విలీనం, ఉద్యోగ భద్రత, వేతన సవరణతో పాటు కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 9వ తేదీన జరగనున్న ఆర్టీసీ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్, టీఎంయూ, ఎన్ఎంయూ జేఏసీ కూటమిని గెలిపించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ బాబు పిలుపునిచ్చారు. ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మణుగూరు ఆర్టీసీ డిపో ఎదుట ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ముందుగా ఆర్టీసీ ఉద్యమంలో మృతి చెందిన శంకర్‌గౌడ్ చిత్రపటానికి నాయకులు, కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. మణుగూరు డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి పవన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ బాబు, నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మౌలానా మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్ యూనియన్ అనేక సంవత్సరాలుగా పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. 2019 నుంచి ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరగలేదని, కార్మికుల సమస్యలపై ఎంప్లాయిస్ యూనియన్, టీఎంయూ, ఎన్ఎంయూ ఐక్యంగా ఉద్యమించాయని పేర్కొన్నారు. గతంలో చేపట్టిన సమ్మెలు, ఉద్యమాల ఫలితంగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, పీఆర్సీ, వేతన సవరణ వంటి అంశాలు చర్చకు వచ్చాయని వారు తెలిపారు. ఐక్య కూటమికి గుర్తింపు లభిస్తే ప్రభుత్వంలో పూర్తిస్థాయి విలీనం, ఉద్యోగుల సర్వీస్ కండిషన్లు, వేతన సవరణ, జీతభత్యాల సవరణ, 2017 బకాయిల సాధన కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని అయిన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మవద్దని ఆయన కోరారు. ఇతర సంఘాలపై విమర్శలు చేస్తూ, గతంలో కార్మికులకు నష్టం కలిగించిన నాయకులతో కొత్త కూటములు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. సంఘాల పేర్లు, కూటములు మార్చుకుంటూ ఎన్నికల సమయంలో మాత్రమే కార్మికుల ముందుకు వచ్చే వారిని కాకుండా నిరంతరం కార్మికుల సమస్యలపై పోరాడే నాయకత్వాన్ని గుర్తించి ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో ఎంప్లాయిస్ యూనియన్ బస్సు గుర్తుకు, ఖమ్మం రీజియన్‌లో ఎన్ఎంయూ కాగడ గుర్తుకు ఓటు వేసి ఐక్య కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. గుర్తింపు వచ్చిన అనంతరం కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన ప్రయోజనాల సాధన కోసం ఐక్యంగా పోరాడతామని తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రెడ్డి పుల్లారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నారాటి ప్రసాద్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పి అప్పారావు, జీఎస్ నారాయణలు మాట్లాడారు. కార్యక్రమంలో కందుల భాస్కర్, ఎన్ఎంయూ నాయకులు ఎల్ఆర్ కె రావు, కెఎస్ పాల్, సీఎం కృష్ణ, సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు జంగం మోహన్‌రావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేర్పుల మల్లికార్జున్, సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్షుడు రాయల భిక్షం, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, తదితరులు పాల్గొన్నారు. మణుగూరు డిపో ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ నాయకులు కె మల్లికార్జున్, పవన్, మధు, మురళి, ఎంఆర్ సి రావు, వైవి రావు, పి ప్రసాద్, ఎస్ఎంఎస్ రావు, యాకూబ్, లింగస్వామి, ఎస్కె సర్వర్, సోది కుటుంబరావు, ఎస్‌డి ఉమర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జేఏసీ నాయకులు డిపో కార్మికులను కలిసి తమ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.



## తెలంగాణా వార్డు మెంబర్స్ ఫోరం' నియోజకవర్గ అధ్యక్షుడి యామకం

**దమ్మపేట ,మహా :** తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరం నియోజకవర్గ అద్యక్షునిగా దమ్మపేట పంచాయతీకి చెందిన 14వ వార్డు సభ్యులు దారా రమేష్ ఏకగ్రీవంగా నియామకం అయ్యారు. ఈ మేరకు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో తెలంగాణా రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరం జిల్లా అధ్యక్షురాలు నక్కా లక్ష్మీ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిధులు గా వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి హాజరయ్యారు.సమావేశం లో ఆమె మాట్లాడుతూ తెలంగాణా లో పంచాయతీ వార్డు సభ్యులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై పోరాటం చేయడమే తమ లక్ష్యం గా వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ,నియోజకవర్గ కేంద్రాలలో అధ్యక్ష ,కార్యదర్శులను నియమిస్తున్నామని తెలిపారు. అనంతరం అశ్వారావుపేట నియోజకవర్గ వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షునిగా నియామకమైన ,దమ్మపేట పంచాయతీ 14వ వార్డు సభ్యులు దారా రమేష్ (రాము) కి ఈ మేరకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా నియామకమైన రాము మాట్లాడుతూ వార్డు సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా స్థాయి ,రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి ఫోరం తరపున సమస్యలను తీసుకువెళ్ళి ,పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏకగ్రీవంగా నియామకం కావడం పట్ల దమ్మపేట పంచాయతీ వార్డు సభ్యులు, పలువురు అభిమానులు శుభాకాంక్షలు అందజేశారు.



# 36 శాతానికి పైగా లాభాల బోనస్ ప్రకటించాలి..

- జీఎం కార్యాలయం ఎదుట టిబిజీకేఎస్ ధర్నా
- వాస్తవ లాభాలను పారదర్శకంగా వెల్లడించాలి..
- టీబిజీకేఎస్ నేత నాగెల్లి వెంకటేశ్వర్లు

**మణుగూరు, మహా :** సింగరేణి సంస్థకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన వాస్తవ లాభాలను ఎలాంటి తగ్గింపులు, మినహాయింపులు లేకుండా పారదర్శకంగా ప్రకటించి, అందులో నుంచి కార్మికులకు 36 శాతానికి పైగా లాభాల బోనస్ తక్షణమే ప్రకటించి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో మంగళవారం సాయంత్రం మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం ఎదుట టిబిజీకేఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఏరియా టిబిజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు నాయకత్వంలో జరిగిన కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లకు అనుకూలంగా నినాదాలు చేశారు. అనంతరం ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సింగరేణి అభివృద్ధి, లాభాల సాధనలో కార్మికుల శ్రమే కీలకమన్నారు. ఎండా, వానా, పగలు, రాత్రి తేడా లేకుండా ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కార్మికులకు వారి కష్టానికి తగిన న్యాయమైన లాభాల వాటా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంపై ఉందన్నారు. 2025-26లో సాధించిన వాస్తవ లాభాలను పూర్తిస్థాయిలో వెల్లడించి, వాటి ఆధారంగా కార్మికులకు 36 శాతానికి పైగా లాభాల వాటాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. బోనస్ మొత్తాన్ని ఆలస్యం చేయకుండా నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి దిశానిర్దేశం మేరకు మణుగూరు ఏరియాలో ఈ ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలి.. 36 శాతానికి పైగా లాభాల వాటాను చెల్లించాలి" అంటూ కార్మికులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్‌కుమార్, జంగం రాజ్‌కుమార్, బొడ్డుల ప్రవీణ్‌కుమార్, మస్తాన్, దిశెట్టి రమేష్, చిరుత వెంకటేశ్వర్లు, బడే హరీష్, సర్వే నరేష్, అజ్మీరా అశోక్, ఇమ్రాన్, కటారి ప్రసాద్, తన్నీరు లింగయ్య, ఉప్పులేటి మురళి, హనీఫ్, సర్వేశ్, శ్రీను, నాగేశ్వరరావు, రాజేందర్, తిరుపతి, యోగి, శివప్రసన్న, బంగారి సురేష్, తోట తిరుపతి, మెదరి మహేష్, ఆపరేటర్ రమేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పారిశుద్ధ్య కార్మికుడు

**పరామర్శించిన ఎమ్మెల్యే. ఆర్థిక సహాయం అందజేత**

**కుషాయిగూడ, మహా :** నాచారం డివిజన్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న నాగారం నరసింహ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అక్టోబర్ 2న విధుల్లో భాగంగా హబ్సిగూడ వద్ద రహదారిని శుభ్రం చేస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆయన రెండు కాళ్లు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆసుపత్రికి వెళ్లి నరసింహను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నరసింహ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయను కలిసి నరసింహకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, గంధం నాగేశ్వరరావు, నాగారం బాబు, ఎస్ఎఫ్ఏ ఏకస్వామి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ వెంకటేశ్వర దివ్యక్షేత్రం శంకుస్థాపనకు ఆహ్వానం..

**చిన్నజీయర్ స్వామి ని కలిసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు...**

రాజేంద్రనగర్ మహా : ఈ నెల 12న ఖమ్మంలో శ్రీ వెంకటేశ్వర దివ్యక్షేత్ర శంకుస్థాపనకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, త్రిదండి చిన్న జీయర్ స్వామీజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామీజీకి పాదాభివందనం చేసి, ఆయన దివ్యాశీస్సులు అందుకున్నారు. ఈ నెల 12వ తేదీన ఖమ్మం పట్టణంలో నూతనంగా నిర్మించతలపెట్టిన శ్రీ వెంకటేశ్వర దివ్యక్షేత్రం శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమానికి రావాల్సిందిగా స్వామీజీని మంత్రి తుమ్మల ఆహ్వానించారు. ఈ వేడుకలు పరమపూజ్య శ్రీ చిన్న జీయర్ స్వామీజీ అమృత హస్తాల మీదుగా అత్యంత వైభవంగా జరగనున్నాయని తెలిపారు. ఈ మహోత్తర ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఖమ్మం జిల్లా ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల భక్తులందరూ విశేష సంఖ్యలో హాజరై, స్వామీజీ దివ్యాశీస్సులతో పాటు శ్రీ వెంకటేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడికి తీవ్ర గాయాలు

**కుషాయిగూడ, మహా**: చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. హెచ్‌సీఎల్ కేబుల్ చౌరస్తా, అశోక్‌నగర్ ప్రాంతంలోని ఓ స్వీట్‌హౌస్‌లో పనిచేస్తున్న రాంసింగ్ అనే యువకుడు ఈ ప్రమాదానికి గురయ్యాడు. అక్టోబర్ 3న ఈ ఘటన చోటుచేసుకుంది. హైటెన్షన్ విద్యుత్ వైర్లకు ఆనుకుని ఇంటి నిర్మాణ పనులు చేపట్టిన సమయంలో వైర్లు ఒక్కసారిగా లాగడంతో సమీపంలో ఉన్న రాంసింగ్‌కు విద్యుత్ షాక్ తగిలినట్లు సమాచారం. దీంతో అతడి ఒంటిపై మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చర్లపల్లి పోలీసులు తెలిపారు. ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని స్పష్టం చేశారు.



# సర్వ రోగాలకు నిలయం...జవహర్ నగర్ డంపింగ్ పరిసర ప్రాంతాలు

- వాన వస్తే జిగటమయం... ఎండొస్తే ముక్కులు మూయటం
- పట్టణీకరణను.. దెబ్బతీస్తున్న చెత్త కొండ
- పడకేసిన ప్రజారోగ్యం... చోద్యం చూస్తున్న మున్సిపల్ యంత్రాంగం



**జవహర్ నగర్, మహా** : పేరుకే హైదరాబాదుకు ఘనమైన చరిత్ర. సాంస్కృతిక పట్టణం, అభివృద్ధికి ఆలవానం, సంస్కృతి సాంప్రదాయాలకు పుట్టినిల్లు, ఇది హైదరాబాద్ ఘన చరిత్ర, ఇంతటి ఘన చరిత్ర కలిగిన హైదరాబాద్ పరిధిలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ దాని చుట్టుపక్కల ఉన్న కాలనీల ప్రస్తుత స్థితి అగమ్య గోచరంలా తయారయింది. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల ప్రాంతాలైన దమ్మాయిగూడ, కాప్రా, ఈసీఐఎల్, సైనిక్ పురి, బాలాజీ నగర్, ఆర్జి కాలనీ, శాంతినగర్, గబ్బిలాల పేట వంటి నివాస ప్రాంతాలు డంపింగ్ యార్డ్ వాసనకు గురై తీవ్రమైన ఇక్కట్లను ఎదుర్కొంటున్నాయి. డంపింగ్ కొండ నుంచి వచ్చే దుర్వాసన దుమ్ము ధూళి కలుషిత జలాలతో ఈ ప్రాంతంలోని ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ మేడ్చల్ జిల్లా కాప్రా మండలం పరిధిలోని జవహర్ నగర్ లో ఉన్న అతిపెద్ద డంపింగ్ కొండ. ఈ యార్డ్ లో దాదాపుగా 130 ఎకరాల మేరకు పేరుకుపోయిన చెదారం చెత్తగుట్ట నుండి వెలువడే దుర్గంధం పరిసర ప్రాంత ప్రజలను తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తూ ఉంది. ఈ డంపింగ్ ఇబ్బందులను తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో చెత్తను క్యాపింగ్ చేసి సైంటిఫిక్ ల్యాండ్ ఫీల్డ్ గా మార్చుటకు చెత్తకుప్ప నుండి సస్టైనబిలిటీ సంస్థ నుండి రోజుకు ఐదు టన్నుల సిఎన్జి బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తుండగా ఇక్కడ నుంచి వచ్చే కాలుష్య కారకాల వ్యర్థాలను జవహర్ నగర్ లోని వివిధ కాలనీలలో మురుగునీరై ప్రవేశిస్తుండడంతో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల ఉన్న పరిసర ప్రాంత ప్రజలు తీవ్రమైన అనారోగ్య బారిన పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారు నివసించే ప్రాంతాల్లో గాలి కలుషితం నీరు కలుషితం చివరకు తినే తిండి కూడా కలుషితమైపోతుందని ఈ ప్రాంత వాసుల ఆవేదన. ప్రస్తుతం జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ నుండి దుర్వాసన హానికర పదార్థాలు రావడంతో అక్కడ స్థానిక ప్రజలు తీవ్రమైన అనారోగ్యాల బారిన పడ్డారు. వర్షాకాలంలో చెత్తగుట్టలోని వరదనీరు కాలనీలకు చేరడంతో లిచట్ ఘన వ్యర్థాలు భూగర్భ జలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని శాంతి నగర్, గబ్బిలాల పేట, కార్మిక నగర్, కెసిఆర్ కాలనీ, తదితర ప్రాంతాలను కలుషిత నీటితో నింపేస్తూ ఉన్నాయి. దీంతో చెత్తగుట్టలోని వరద నీరు చేరడంతో లిచట్ ఘనపదార్థాలు భూగర్భజలంతోపాటు చెరువులను కలుషితం చేస్తున్నాయి. దీంతో వ్యర్థాలను బయోమైనింగ్ చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సూచించింది. అయినప్పటికీ పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్ల ఇప్పటికీ జవహర్ నగర్ చెత్త సమస్య "కలగానే" మిగిలిపోయింది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి డంపింగ్ ప్రభావిత ప్రాంతాలైన బాలాజీ నగర్, శాంతినగర్, దమ్మైగూడ, ఆర్జి కాలనీ, హరిదాసు పల్లి, కెసిఆర్ నగర్, గబ్బిలాల పేట, ప్రగతి నగర్ ,కెఎన్ఆర్ నగర్, నాచారం ఫైర్ విక్టిమ్ కాలనీలలో తదితర ప్రాంత వాసులకు నిత్య నరక కూపంగా మారిన డంపింగ్ వాసననుండి విముక్తి కల్పించాలని జవహర్ నగర్ దాని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కోరుకుంటున్నారు.



**పాలకుల నిర్లక్ష్యమే కారణం:** పదుల సంఖ్యలో గొలుసు కట్టు చెరువులను కుంటలను వాటిలో నివసిస్తున్న అనేక జీవరాసులతో పాటు ప్రకృతిని పర్యావరణాన్ని సర్వనాశనం చేస్తూ లక్షలాది మంది అమాయక ప్రజల ఆరోగ్యాలతో చలగాటమాడుతున్న డంపింగ్ యార్డ్ పై నాయకులు ఎందుకింత ప్రేమాభిమానం? ప్రజల ప్రాణాల కంటే డంపింగ్ యార్డ్ పై వచ్చే ఆదాయమే మీకు విలువైనదా? భవిష్యత్తులో జరగబోయే గ్రేటర్ ఎన్నికల్లో ఇక్కడ ప్రజల ముందుకు వచ్చి ఏమని ఓట్లు అడుగుతారు? ప్రపంచంలోనే అతిపెద్ద రెండవ చెత్త డంపింగ్ యార్డ్ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉండగా విశ్వ నగరంగా హైదరాబాద్ ఎలా పిలవబడుతుంది? పాలకులే సమాధానం చెప్పాలి?

**(పడకంటి శంకరాచారి. (కెసిఆర్ నగర్).**



**కాలుష్యపు దుర్గంధపుగాలితో ఉక్కిరిబిక్కిరి**

మేము నివసించే ప్రాంతాల్లో రాత్రి వేళలో విపరీతమైన రసాయనాలను, దుర్వాసనను రావడం వలన గ్రౌండ్ వాటర్ పూర్తిగా కలుషితం కావడం వల్ల మేము ఉండే కాలనీలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. రాత్రిపూట వచ్చే దుర్వాసన వల్ల మాకు కాలరాత్రి అవుతుంది. డంపింగ్ యాజమాన్యం ఇకనైనా డంపింగ్ దుర్వాసనను పోగొట్టడానికి రసాయనాలు చల్లి మాకు దుర్వాసన నుండి విముక్తి కల్పించవలసిందిగా కోరుతున్నాం.

**శ్యామల శంకర్ (ప్రగతి నగర్ వాసి)**




# వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వనదర్శిని

**జైపూర్ కస్తూర్బా విద్యార్థులకు అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన**

జైపూర్ / మంచిర్యాల, మహా : వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, జైపూర్ విద్యార్థులను అటవీ శాఖ ఆధ్వర్యంలో వాన దర్శినికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బర్డ్ వాచింగ్ ప్రోగ్రాం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యానికి సంబంధించిన వివిధ అంశాలను తెలుసుకున్నారు. అడవులను కాపాడుదాం, వన్యప్రాణులను సంరక్షిద్దాం, భవిష్యత్ తరాలకు సుస్థిర అభివృద్ధిని అందిద్దాం అని ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రామకృష్ణ సర్కార్, బీట్ ఆఫీసర్లు వసంతలక్ష్మి, కె.రమేష్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం అధ్యాపకురాలు సౌందర్య విద్యార్థులు పాల్గొన్నారు.



మహా పత్రిక



WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | బుధవారం, హైదరాబాద్ | 07-10-2026

ANN తెలుగు

# ఇంద్రజపై భావోద్వేగానికి గురైన నిర్మాత



మహా: సీనియర్ నటి ఇంద్రజపై నిర్మాత లగడపాటి శ్రీధర్ ప్రశంసల వర్షం కురిపించారు. తన కుమారుడు విక్రమ్ సహిదేవ్ నటించిన 'అనకాపల్లి' సినిమా విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఇంద్రజతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఇంద్రజకు ఉన్న నటనా ప్రతిభతో పాటు ఆమె వ్యక్తిత్వం కూడా తనను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. ఇప్పటికీ కథానాయికగా కనిపించే స్థాయిలో ఉన్న ఇంద్రజ తల్లి, ఇతర కీలక పాత్రల్లో నటించేందుకు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. కథకు ప్రాధాన్యం ఉన్న పాత్ర ఏదైనా సరే తన ఇమేజ్‌ను పక్కనపెట్టి అంగీకరించే స్వభావం ఇంద్రజలో ఉందని శ్రీధర్ పేర్కొన్నారు. నటిగా ఆమెకు ఉన్న అనుభవం, భావోద్వేగాలను పలికించే సామర్థ్యం సినిమాకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మంచి పాత్రలు లభిస్తే ఇంద్రజ మరింతగా ప్రేక్షకులను అలరించగలరని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఇంద్రజ మాట్లాడుతూ.. హీరోయిన్‌గా తన సినీ ప్రయాణం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రేక్షకులు చూపించిన ఆదరణను ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. వయసుకు అనుగుణంగా పాత్రలు మారడం సహజమేనని, ప్రస్తుతం తల్లి పాత్రలు చేస్తున్నప్పటికీ వాటిని తాను భారంగా భావించడం లేదని చెప్పారు. కథలో తన పాత్రకు ప్రాధాన్యం ఉండటమే తనకు ముఖ్యమని తెలిపారు.ప్రేక్షకులు తనను తెరపై చూసి ఆప్యాయంగా స్పందించడం, 'అమ్మ' అంటూ పిలవడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ఇంద్రజ చెప్పారు. మంచి కథ, బలమైన పాత్ర లభించిన ప్రతిసారీ నటించేందుకు సిద్ధంగా ఉంటానని వెల్లడించారు. ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా విభిన్నమైన పాత్రలు చేయాలనే ఆసక్తి ఉందన్నారు.'అనకాపల్లి' విజయోత్సవ కార్యక్రమంలో చిత్రబృందం సభ్యులు, నటీనటులు పాల్గొని సినిమా విజయంపై తమ ఆనందాన్ని పంచుకున్నారు. ప్రేక్షకుల ఆదరణే తమకు అతిపెద్ద బలమని చిత్రబృందం పేర్కొంది. సినిమా విజయంతో నటీనటులు, సాంకేతిక నిపుణుల్లో మరింత ఉత్సాహం నెలకొంది.

## రాజసం ఉట్టిపడేలా

# తాప్సీ లుక్

మహా: బాలీవుడ్ నటి తాప్సీ పన్ను మరోసారి తన సంప్రదాయ వస్త్రధారణతో అభిమానులను ఆకట్టుకున్నారు. తాజాగా ఆమెకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఐవరీ రంగు ఆర్గాంజా చీరలో తాప్సీ ఎంతో అందంగా, హుందాగా కనిపించారు. చీరకు ఉన్న బంగారు అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ అందానికి ఆధునిక ఫ్యాషన్ టచ్ జోడిస్తూ రూపొందించిన ఈ లుక్ తాప్సీ వ్యక్తిత్వానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది చీరకు సరిపోయేలా డిజైన్ చేసిన అలంకరణలతో కూడిన బ్లౌజ్‌ను ఆమె ధరించారు. మెడలో ప్రత్యేకమైన ఆభరణాలు లేకపోయినా, పెద్ద సైజు గోల్డ్ చెవిపోగులు లుక్‌కు రాజసాన్ని తీసుకొచ్చాయి. ముఖానికి సింపుల్ మేకప్ వేసుకుని, జుట్టును సహజమైన స్టైల్‌లో ఉంచడంతో ఆమె అందం మరింత మెరిసింది. తాప్సీ చూపులు, హావభావాలు ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి సంప్రదాయ దుస్తుల్లోనూ తనదైన శైలిని ప్రదర్శించడం తాప్సీకి కొత్తేమీ కాదు. చీరలను ఆధునిక శైలిలో ధరించడం ద్వారా ఆమె తరచూ ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఈ తాజా లుక్‌లోనూ ఆర్గాంజా చీర, బంగారు వివరాలు, ఆభరణాల ఎంపిక మధ్య చక్కటి సమన్వయం కనిపించింది. దీంతో తాప్సీ తాజా ఫొటోలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

## రూ.200 కోట్ల దిశగా

# ది పారడైజ్

**మహా:** నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ది పారడైజ్' బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. విడుదలకు ముందు భారీ అంచనాలను సొంతం చేసుకున్న ఈ చిత్రం.. థియేటర్లలోకి వచ్చిన తర్వాత మిశ్రమ స్పందనలు ఎదురైనప్పటికీ వసూళ్ల పరంగా మాత్రం జోరు కొనసాగిస్తోంది.విడుదలైన 11 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.186 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్రబృందం వెల్లడించింది. ఇప్పటికే వరల్డ్‌వైడ్ రికవరీలో 97 శాతం పూర్తయినట్లు సమాచారం. ఇదే వేగం కొనసాగితే త్వరలోనే రూ.200 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. భారీ యాక్షన్ అంశాలు, నాని విభిన్నమైన మాస్ లుక్, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వ శైలి సినిమాపై ఆసక్తిని పెంచాయి. అనిరుధ్ రవిచందర్ సంగీతం, మోహన్‌బాబు ప్రతినాయక పాత్ర కూడా చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విడుదలకు ముందే సినిమాపై భారీ హైప్ నెలకొనగా.. తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా రూ.88 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఇది నాని కెరీర్‌లో అత్యధిక ఓపెనింగ్‌గా నిలిచింది. సోషల్ మీడియాలో వచ్చిన ప్రతికూల ప్రచారాన్ని పక్కనపెట్టి ప్రేక్షకులు థియేటర్లకు రావడం సినిమాకు కలిసొచ్చిన అంశంగా మారింది. ప్రస్తుతం రూ.200 కోట్ల క్లబ్‌పై చిత్రబృందం దృష్టి పెట్టింది. ఈ మైలురాయిని 'ది పారడైజ్' ఎంత వేగంగా చేరుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.





## పచ్చచీరలో అనుపమ

# అందాల సందడి

మహా: టాలీవుడ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మరోసారి తన సంప్రదాయ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆమె పచ్చచీరలో ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. పచ్చని వాతావరణం మధ్య చిరునవ్వులు చిందిస్తూ అనుపమ ఇచ్చిన ఫోజులు నెటిజన్లను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

తాజా ఫొటోషూట్ కోసం అనుపమ పచ్చటి షేడ్స్‌లో ఉన్న సిల్క్ చీరను ఎంచుకున్నారు. చీరపై కనిపించే బంగారు గీతలు, అంచులోని మెరుపులు సంప్రదాయ అందాన్ని మరింత పెంచాయి. దీనికి అనుగుణంగా పచ్చటి బ్లౌజ్‌ను ధరించి హుందాగా కనిపించారు. చీరకట్టులో ఎలాంటి అతిశయోక్తి లేకుండా సింపుల్‌గా కనిపిస్తూనే తన అందంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. లుక్‌కు తగ్గట్టుగా అనుపమ మెడలో సున్నితమైన చోకర్, చేతులకు పచ్చని గాజులు, బంగారు బ్యాంగిల్స్ ధరించారు. చిన్న బొట్టు, సహజమైన మేకప్, ముఖంపై పడుతున్న సాఫ్ట్ కర్ల్స్ ఆమె రూపానికి మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ముఖ్యంగా ఆమె చిరునవ్వు ఫొటోలకు ప్రధాన ఆకర్షణగా మారింది. సంప్రదాయ దుస్తుల్లోనూ తన సహజమైన అందాన్ని ప్రదర్శిస్తూ అనుపమ మరోసారి అభిమానుల ప్రశంసలు అందుకుంటున్నారు. మలయాళ చిత్రం 'ప్రేమమ్'తో సినీ రంగంలోకి అడుగుపెట్టిన అనుపమ.. ఆ తర్వాత తెలుగు, తమిళ, కన్నడ చిత్రాల్లో నటిస్తూ దక్షిణాదిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'అ ఆ', 'ఉన్నది ఒకటే జిందగీ', 'కార్తికేయ 2', 'టిల్లు స్క్వేర్' వంటి చిత్రాలు ఆమెకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం కూడా పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com